PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 208 | విజయవాడ, శనివారం 1 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Saturday 1 March 2025 | Rs




ఆఫ్ఘన్‌తో మ్యాచ్ వర్షార్పణం...

- సెమీస్‌కు ఆస్ట్రేలియా

8





కార్పొరేట్లకే విత్తం

రూ.3.22 లక్షల కోట్ల అంచనాతో భారీ బడ్జెట్

ప్రజల పట్ల కనిపించని చిత్తం • అప్పులు, భారాలే ఆధారం • విదిలింపులు, దాటవేతలే ఎక్కువ

నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1,500, ఫ్రీ బస్ ప్రయాణం స్కీములకు నిధుల్లేవు

అంకెల్లో బడ్జెట్ (రూ.కోట్లలో)

వివరాలు	అక్కౌంట్స్ 2023-24	అంచనాలు 2024-25	సవరించిన అంచనాలు 2024-25	అంచనాలు 2025-26
ప్రారంభ నిల్వ	-53.54	-67.23	-67.16	-67.16
రెవిన్యూ ఆదాయం	1,73,767.01	2,01,173.61	1,76,031.16	2,17,976.53
కేపిటల్ ఆదాయం	79,775.92	93,253.64	98,576.60	1,04,382.80
మొత్తం ఆదాయం	2,53,542.93	2,94,427.25	2,74,607.76	3,22,359.33
రెవిన్యూ వ్యయం	2,12,449.56	2,35,916.99	2,24,342.63	2,51,162.50
కేపిటల్ వ్యయం	23,330.48	32,712.84	24,072.46	40,635.72
మొత్తం వ్యయం	2,53,556.55	2,94,427.25	2,74,607.76	3,22,359.33
రెవిన్యూ లోటు	-38,682.55	-34,743.38	-48,311.47	-33,185.97
ద్రవ్య లోటు	-62,719.59	-68,742.65	-73,362.36	-79,926.90




బడ్జెట్ బ్యాగుతో సిఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పయ్యావుల కేశవ్, తదితరులు

అసెంబ్లీ సమావేశాలను ప్రారంభిస్తూ గవర్నర్ ప్రసంగంలో టిడిపి కూటమి ప్రభుత్వం దిశా నిర్దేశం చేసిన కార్పొరేట్ సంస్కరణలు కేంద్రంగా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం 3.22 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగం యావత్తూ 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్య సాధన, అందుకు ఎంచుకున్న విధానాలు, పి-4 చుట్టూనే తిరిగింది. మధ్య మధ్య సంక్షేమం, సూపర్ సిక్స్, అభివృద్ధి ఇత్యాది పదాలు వినిపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రతిపాదించిన తొలి పూర్తి స్థాయి బడ్జెట్ అయినప్పటికీ సామాన్యులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీల ప్రస్తావన అంతగా లేదు. రాష్ట్ర విభజన తర్వాత రూ.3 లక్షల కోట్లు దాటిన భారీ బడ్జెట్ ఇదే. కానీ అంచనాలు, ఊహాజనితంగా, నేల విడిచి సాము చేసినట్లుగా ఉన్నాయి. అంకెల గారడీ కనిపించింది.ద్రవ్యలోటుకు తోడు, అప్పుల భారం పెరుగుతుండటం,వాస్తవికతకు దూరంగా ఆదాయ అంచనాలు ఉండటంతో ప్రజలపై పన్నుల భారం తప్పని స్థితి నెలకొంది. మెగా డిఎస్సీతో సహా నిరుద్యోగులు ఎదురుచూస్తున్న వివిధ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీ ఊసులేదు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న నిరుద్యోగ భృతిని విస్మరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 1500 రూపాయలు వంటి పథకాల ప్రస్తావన కూడా కనిపించలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవకు అత్తెసరు అరకొర సరిపుచ్చారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గాయి. మొత్తంమీద కార్పొరేట్లకు లాభాల పంటనిచ్చే సంస్కరణలు, అప్పులు, ప్రజలపై భారాలు, అతి అంచనాలు... ఇదీ పయ్యావుల ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ సంగ్రహ స్వరూపం.!

బడ్జెట్‌పై మరిన్ని వార్తలు లోపలి పేజీల్లో..

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది : చంద్రబాబు నాయుడు



సంక్షేమం, అభివృద్ధి, సుస్థిరపాలన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. 2025-26 బడ్జెట్ ఎపికి దిక్సూచిలా నిలుస్తుంది. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి వీలుగా కేటాయింపులు జరిపాం. కీలక రంగాలకు, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించాం. స్వర్ణాంధ్ర -2047 విజన్‌లోని పది సూత్రాల లక్ష్యసాధనకు వారధిగా బడ్జెట్ నిలుస్తుంది. సూపర్‌సిక్స్ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చాం. అన్నదాత సుఖీభవ కోసం రూ.6300 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9407 కోట్లు కేటాయించాం.

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు : సిపిఎం రాష్ట్ర కమిటీ



రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా బడ్జెట్ లేదు. పైగా లక్షల కోట్లు అదనంగా అప్పు తేబోతున్నారు. బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తే రూ.80 వేల కోట్ల ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉంది. పన్ను ఆదాయం రూ.14 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.12 వేల కోట్లు పెంచి చూపడం ద్వారా ఇది ప్రజలపై భారాలు పెంచుతుంది లేదా అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాలకు కోతపెట్టే ప్రమాదముంది. అన్ని పథకాలకు కేటాయింపులు చూపడం కోసం ఆచరణాత్మకం కాని ప్రతిపాదనలు చేసినట్లు అనిపిస్తోంది.

ఎవరికీ మేలు చేయని బడ్జెట్ : బొత్స సత్యనారాయణ



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎవరికీ మేలు చేయని విధంగా ఉంది. గత ప్రభుత్వాన్ని దూషించడానికి, సిఎం చంద్రబాబు, లోకేష్‌లను పొగడ్తలతో ముంచెత్తడానికే బడ్జెట్ ప్రసంగం పరిమితమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల కేటాయింపులు ఎక్కడా లేవు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేశారు. తల్లికి వందనం, రైతు భరోసాలకు అరకొర కేటాయింపులు చేశారు.

ఉత్తరాఖండ్‌లో హిమఖడ్గం

- మంచు పెళ్లల కింద ఇప్పటికీ 25 మంది కార్మికులు
- 32 మందిని రక్షించిన సహాయక బృందాలు
- ఇంకా కొనసాగుతున్న సహాయక కార్యక్రమాలు



సంఘటనా ప్రాంతం నుంచి కార్మికులను తరలిస్తున్న సహాయక బృందాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌పై హిమపాతం విరుచుకుపడింది. చమోలి జిల్లాలోని సరిహద్దు గ్రామం మానా సమీపంలో శుక్రవారం ఉదయం పెద్దయెత్తున్న ఆకస్మిక మంచు కురవడంతో సరిహద్దు రహదారుల సంస్థ (బోర్డర్స్ రోడ్స్ ఆర్గనైజేషన్-బిఆర్‌ఒ)కు చెందిన 57 మంది నిర్మాణ రంగ కార్మికులు చిక్కుపోయారు. ఈ ప్రమాదం గురించి తెలిసినవెంటనే ఉత్తరాఖండ్‌కు జాతీయ విపత్తు నివారణ దళం (ఎస్‌డిఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు నివారణ దళం (ఎన్‌డిఆర్ఎఫ్) బృందాలు హుటాహుటిన చేరుకున్నాయి. మొత్తం 57 మంది కార్మికులు చిక్కుకోగా ఇప్పటి వరకూ 32 మందిని రక్షించారు. శుక్రవారం రాత్రి వరకూ కూడా సహాయక కార్యక్రమాలు కొనసాగాయి. అయితే మంచు కురుస్తుండటం, వెలుతురు లేమి సహాయక కార్యక్రమాలకు అడ్డంకిగా మారాయి. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) సహాయం కూడా తీసుకున్నట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి వెల్లడించారు. ఆకస్మిక హిమపాతంతో మనా-బద్రీనాథ్ మధ్య ఉన్న బిఆర్‌ఒ శిబిరం పూర్తిగా మంచు కింద కూరుకుపోయిందని చమోలి జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ తెలిపారు. మానా అనేది టిబెట్ సరిహద్దులో భారత్‌కు చివరి గ్రామం. ఈ గ్రామం సముద్రమట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో, బద్రీనాథ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ బిఆర్‌ఒ నేతృత్వంలో రహదారి పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం హిమపాతం కురవడంతో రహదారి నిర్మాణ పనుల్లో ఉన్న 57 మంది కార్మికులు చిక్కుపోయారు. కార్మికులను రక్షించడం కోసం ఆరు బృందాలను తరలించినట్లు ఎన్‌డిఆర్ఎఫ్ డైరక్టర్ జనరల్ పియూష్ ఆనంద్ తెలిపారు. ఆగకుండా కురుస్తున్న మంచు, వర్షం కారణంగా సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందని ముఖ్యమంత్రి ధామి తెలిపారు. అనూకూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ సేవలను ఉపయోగించుకోలేక పోతున్నామని అన్నారు. అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, కార్మికులందర్నీ రక్షించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కేంద్ర హోం మంత్రి తమతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారని, సమాచారం తెలుసుకుంటున్నారని ముఖ్యమంత్రి ధామి తెలిపారు. అలాగే కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ముఖ్యమంత్రితో మాట్లాడారు.

సెబీ నూతన ఛైర్మన్‌గా తుహిన్ కాంత పాండే



న్యూఢిల్లీ : మార్కెట్, పెట్టుబడుల రెగ్యులేటరీ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) నూతన ఛైర్మన్‌గా తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని, బ్రిటన్‌లో ఎంబిఎ చేసిన పాండే అనేక పదవులను చేపట్టిన అనుభవం ఉంది. అదే విధంగా ప్రధాని మోడీకి అత్యంత నమ్మకస్తుల్లో పాండే ఒక్కరనే ప్రచారం ఉంది. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలపడంతో.. సెబీ ఛైర్మన్‌గా మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. కాగా.. ప్రస్తుత సెబీ ఛైర్మన్ మాధబి పూరీ బుచ్ పదవీ కాలం మార్చి1తో ముగియనుంది. అదానీ, ఇతర కార్పొరేట్లతో మాధబి అంటకాగారని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే.

ఆర్థిక వ్యవస్థ మందగమనం

- 6.2 శాతానికే జిడిపి పరిమితం
- డిసెంబర్ త్రైమాసికంలో భారీ క్షీణత
- తయారీ రంగం వెలవెల : ఎన్ఎస్ఒ నివేదిక



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జిడిపి 6.2 శాతానికే పరిమితమైంది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం ఆందోళన కలిగించే అంశం. తయారీ, మైనింగ్ రంగాల్లో పేలవమైన పనితీరు కారణంగా వృద్ధి క్షీణించిందని కేంద్ర గణాంకాల శాఖ (ఎన్ఎస్ఒ) శుక్రవారం ఓ నివేదికలో వెల్లడించింది. 2023-24 ఇదే త్రైమాసికంలో 9.5 శాతం వృద్ధి నమోదైంది. దీంతో పోల్చితే భారీగా తగ్గింది. గతేడాది జులై - సెప్టెంబర్ త్రైమాసికంలోని 5.6 శాతం వృద్ధితో పోల్చితే కొంత మెరుగుదల కనబడింది. 2024-25లో జిడిపి 6.4 శాతం ఉండొచ్చన్న ఎన్ఎస్ఒ గణాంకాలతో పోల్చినా పేలవ ప్రదర్శన నమోదైంది. ఆర్‌బిఐ, ఆర్థిక సర్వే వేర్వేరుగా వేసిన అంచనా 6.8 శాతం కంటే కూడా తక్కువే కావడం గమనార్హం. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిడిపి రేటును 8.2 శాతం నుంచి 9.2 శాతానికి సవరించింది. 2022-23లో ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం, 2021-22లో 8.7 శాతం చొప్పున వృద్ధి చోటు చేసుకుంది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో స్థిర ధరల వద్ద జిడిపి రూ.47.17 లక్షల కోట్లుగా ఎన్ఎస్ఒ అంచనా వేసింది.ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగం రాణించగా.. తయారీ రంగం వెలవెలబోయింది. 2024 డిసెంబర్ త్రైమాసికంలో తయారీ రంగం ఏకంగా 3.5 శాతానికి క్షీణించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో తయారీలో 14 శాతం వృద్ధి నమోదైంది. దీంతో పోల్చితే భారీ పతనాన్ని చవిచూసింది. క్రితం క్యూ3లో గనుల రంగం 2.8 శాతం పెరుగుదలతో పేలవ ప్రదర్శన కనబర్చింది. ఇంతక్రితం ఏడాది ఈ రంగం 3.2 శాతం వృద్ధిని సాధించింది.

ఉత్సాహంగా పడవ పోటీలు

ఘనంగా గోదావరి నదీ జలాల సంరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

గోదావరి నదీ జలాల సంరక్షణ దినోత్సవం శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా 'ఘాట్ పే యోగా', అనంతరం మత్స్యకారులకు పడవల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 15 బోట్లు పాల్గొన్నాయి. విజేతలకు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ బహుమతులను అందజేశారు. జల ఉత్సవంలో భాగంగా స్థానిక కాస్మోపోలిటన్ క్లబ్‌లో వాల్ పేయింటింగ్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నేషనల్ రివర్ కన్సర్వేషన్ డైరెక్టరేట్ అండర్ మినిస్ట్రీ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నదీ సంరక్షణ, నీటి కాలుష్యం నియంత్రణ, శానిటేషన్ నిర్వహణపై అవగాహన కల్పించామని తెలిపారు. నగరంలో ప్రస్తుతం 160 టన్నుల చెత్త వస్తోందని, లిక్విడ్ వేస్ట్ 60 నుంచి 65 ఎంఎల్ ఉత్పత్తి అవుతోందని వివరించారు. పుష్కరాలకు ఇది రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా నీటి శుద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఐదు నుంచి పది ఎస్‌టిపిలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఇప్పటికే 65 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రాసెసింగ్ చేసిన వాటర్ క్వాలిటీ ఇంప్రూవ్ అయిన తర్వాతే నదిలో విడిచిపెడతారని తెలిపారు.



పడవ పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు

తెలంగాణలో భారీ అగ్నిప్రమాదం

- రెండంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రెండంతస్తుల భవనంలో మంటలు వ్యాపించడంతో ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరు మహిళలు, బాలిక ఉన్నారు. నార్సింగి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట్ మండలం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ పాషా కాలనీ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. మొదటి, రెండవ అంతస్తులో ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రమాదవశాత్తు శుక్రవారం సాయంత్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటల చెలరేగాయి. అవి మొదటి, రెండవ అంతస్తులోకి వ్యాపించాయి. దాంతో దట్టమైన పొగ అలుముకుంది. వెంటనే అపార్ట్‌మెంట్‌లోని వాసులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మొదటి అంతస్తులో ఇద్దరు మహిళలు జమీలా (75), సహానా (40), ఓ చిన్నారి సిజిరా (4) చిక్కుకున్నారు. వీరిని అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ముగ్గురూ మృతి చెందారు. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఓ కారు పూర్తిగా దగ్ధమైంది. రెండో అంతస్తులో ఉన్న చిన్నారులతోపాటు మరో ఐదుగురిని తాడు సాయంతో అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలు ముమ్మరం చేశారు. భవనంలో ఉన్న ఇతరులను బయటకు పంపించారు. భవనంలో మంటలు వ్యాపించడంతో సిలిండర్లు పేలడం వలన ప్రమాద తీవ్రత పెరిగినట్టు స్థానికులు తెలిపారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బడ్జెట్‌కు రూ.48,341 కోట్లు

- శాసనసభలో ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- అన్నదాతా సుఖీభవకు రూ.9,400 కోట్లు
- సాగునీటి పారుదలకు రూ.12,903.41 కోట్లు
- ఉపాధి హామీకి రూ.6,026.87 కోట్లు

3

నియో ఫాసిస్టు బిజెపిని ఐక్యంగా ఎదుర్కోవాలి

- సిపిఎం మహారాష్ట్ర మహాసభలో ప్రకాశ్ కరత్ పిలుపు

7

పేదరిక నిర్మూలనే లక్ష్యం

● అమరావతి, పోలవరం లకు అత్యంత ప్రాధాన్యత ● బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం నాడు రాష్ట్ర శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆయన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 3,22,359 కోట్ల రూపాయలతో జంబో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధంచేస్తోందని, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందోని అన్నారు. అమరావతి,పోలవరం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని చెప్పారు. . తెలుగు భాషాభివృద్ధి గురించి మాట్లాడుతూ ఆంధ్ర భోజుడిగా ఖ్యాతి పొందిన శ్రీకృష్ణ దేవరాయలు రాసిన 'తెలుగు దేలయన్న దేశంబు తెలుగేను...దేశ భాషలందు తెలుగు లెస్స' పద్యాన్ని ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితోనే తెలుగు భాషాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10కోట్లను కేటాయింపులు ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు పయ్యావుల పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి పెట్టుబడి వ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం ముందు చూపుతో అనేక విధాన పరమైన కార్యక్రమాలను ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో 2030 నాటికి దేశం మొత్తం ఉత్పత్తిలో మూడింట ఒక వంతును సాధించాలనే ధ్యేయంతో రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గామార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. "ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీపాలసీ -2024' పునరుత్పాదక ఇంధన తయారీకేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. 2025-26 సంవత్సరానికి ఇంధన శాఖకు రూ.13,600కోట్లను కేటాయింపులు ప్రతిపాదిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు పోలీస్ బలగాల స్థైర్యాన్ని దెబ్బతీశాయని, ఫలితంగా రాష్ట్రంలో అరాచకరాజ్యం చేసిందన్నారు. మాదక ద్రవ్యాలు అదుపు లేకుండా తాండవించాయన్నారు. పోలీస్ బలగాల ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించేందుకు .పేరుకుపోయిన రూ.920కోట్ల బకాయిల నుంచి రూ.250కోట్లను ఇటీవలే చెల్లించామని, గత రెండేళ్లుగా నిలిచిపోయిన గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌పాలసీని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. పోలీస్ దళం ఆధునీకరణ పథకం (ఎంఓపిఎఫ్) కింద రూ.61.20కోట్లను విడుదల చేశామన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రులకు భూములు గుర్తింపు :

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు భద్రత కోసం కుటుంబ యజమానికి చంద్రన్న బీమా పథకం అమలుకు సంబంధించిన విధి విధానాలను నిర్ణయించేందుకు వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గుంటూరు, శ్రీసిటీ, కర్నూలు, పెనుకొండ, అచ్యుతాపురం, శ్రీకాకుళం, నెల్లూరుల్లో ఇఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి భూములను గుర్తించడం జరిగిందన్నారు. తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచడానికి ఆమోదించినట్లు పయ్యావుల తెలిపారు. సాగునీటిరంగాన్ని తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని, గత ప్రభుత్వం సాగునీటిరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు భావి తరాల ప్రజలజీవితాలను మెరుగుపరుస్తుందన్నారు. రాయలసీమ ప్రాంతంతోపాటు కోస్తా జిల్లాల భవిష్యత్తుని మారుస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ప్రాజెక్టు మొదటి దశకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.12,157 కోట్లను పొందగలిగిందని, 2027 నాటికిపోలవరం పూర్తిచేయడం జరుగుతుందన్నారు.గత ప్రభుత్వంలో స్కూల్లో విద్యార్థుల డ్రాపవుట్ పెరిగాయని, ఇవి కాకుండా పరిశ్రమలు డ్రాప్ అవుటయ్యాయన్నారు. గత పాలకులు ఇప్పుడు ఓటమితో అసెంబ్లీకి రాకుండా డ్రాపవుట్ అయ్యారన్నారు. వాళ్లు ప్రజాజీవితంనుంచి త్వరలోనే శాశ్వతంగా డ్రాపవుట్‌ అయ్యే సూచనలు ఉన్నాయన్నారు. 'నేను సైతం ప్రపంచాగ్నికిసమిధనొక్కటి ఆహుతిచ్చాను' అన్న శ్రీశ్రీ గీతాన్ని ప్రస్తావిస్తూ ఆయన ప్రసంగాన్ని ముగించారు.

పేరుకే భారీ బడ్జెట్

● విదిలింపులు, దాటవేతలే ఎక్కువ
● నిరుద్యోగ భృతి, మహిళలకు 1,500, ఫ్రీ బస్ ప్రయాణం స్కీంలకు నిధుల్లేవు
● ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవకు అత్తెసరు నిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,22,359 కోట్ల రూపాయల అంచనాతో భారీ బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. దీనిలో ప్రస్తుత ఏడాది(2024-25)కు సవరించిన అంచనా ప్రకారం బడ్జెట్ రూ.2.74 లక్షల కోట్లుగా చూపారు. వచ్చే ఏడాదికి దాదాపు రూ.48 వేల కోట్లు పెంచారు. ఆ మేరకు విశ్వసనీయమైన ఆదాయ వనరులు చూపించలేకపోయారు. పన్ను ఆదాయాన్నే చూసుకుంటే ప్రస్తుత ఏడాదిలో తొలుత 2.01 లక్షల కోట్లుగా అంచనా వేయగా సవరించిన అంచనాల్లో 1.76 లక్షల కోట్లకు తగ్గిపోయింది. అయినప్పటికీ వచ్చే ఏడాది 2.17 లక్షల కోట్లు ఆశించారు. దాదాపు 43 వేల కోట్లు ఎక్కువ వస్తాయన్నారు. రాష్ట్ర సొంత పన్నుల ద్వారా సమకూరే ఆదాయాన్ని సవరించిన అంచనాల్లో 94 వేల కోట్లు చూపగా వచ్చే ఏడాది 1.09 లక్షల కోట్లకు అంచనాలు పెంచారు. సుమారు 14 వేల కోట్లు అదనంగా రావా లంటే ప్రజలపై అదనంగా పన్నులేయాలి. పన్నేతర ఆదాయం 7 వేల కోట్ల నుంచి 19 వేల కోట్లకు అంచ నాలు పెంచారు. సుమారు 12 వేల కోట్లు రాబట్టాల న్నారు. పన్నేతర ఆదాయం అంటే ప్రభుత్వ భూముల మ్ముతారో, ప్రభుత్వ సంస్థలను అమ్ముతారో తెలీదు.

అప్పులపై ఆధారం

అప్పులు నిరుడు 93 వేల కోట్లు కాగా ప్రస్తుత సంవత్సరానికి సవరించిన అంచనాల్లో 98 వేల కోట్లన్నారు. వచ్చే ఏడాది 1.04 లక్షల కోట్లుగా పేర్కొన్నారు. ధోరణి చూస్తే ఇక్కడితో ఆగేటట్లు లేదు. కేంద్రం నుంచి పన్నుల్లో వాటా, గ్రాంట్లు, సహాయాలు సాధించే విషయంపై మాట్లాడలేదు. కేంద్రం నుంచి గతేడాది 45 వేల కోట్లొచ్చాయి. ప్రస్తుత సంవత్సరానికి సవరించిన అంచనాల్లో 52 వేల కోట్లు ఆశించారు. వచ్చే ఏడాది 57 వేల కోట్లకుపైన వస్తాయంటున్నారు. గత అనుభవం చూస్తే అనుమానంగానే కనిపిస్తోంది. కేంద్రం నుంచి రుణాలు తీసుకుంటామన్నారు.

జిఎస్‌డిపిపై అతి

గతేడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) 14.22 లక్షల కోట్లుగా పేర్కొన్న ప్రభుత్వం, ప్రస్తుత ఏడాది సవరించిన అంచనాల్లో 16 లక్షల కోట్లుగా అంచనా వేసింది. వచ్చే సంవత్సరం 18.25 లక్షల కోట్లుగా అతికి పోయింది. ఒక్క సంవత్సరంలో రెండు లక్షల కోట్ల మేర జిఎస్‌డిపి పెరుగుతుందనడం ఆచరణాత్మకంగా లేదు. అప్పులు, పన్నులు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలతో ద్రవ్యలోటును పూడ్చుకోవాలని ఎంత ప్రయాశ పడినా లోటు భారీగానే ఉంది. రెవెన్యూ లోటు నిరుడు 38 వేల కోట్లు. ప్రస్తుత సంవత్సరంలో సవరించిన అంచనా మేరకు 48 వేల కోట్లు. అయినా వచ్చే ఏట రెవెన్యూలోటు 33 వేల కోట్లేననడం అత్యాశనే. జిఎస్‌డిపిలో రెవెన్యూ లోటు నిరుడు 2.72 శాతం ఉండగా, ఇప్పటికి 3.01 శాతానికి పెరగ్గా, వచ్చే ఏట 1.82 శాతానికి తగ్గిస్తామనడం ఎంత వరకు వాస్తవిక అంచనా అవుతుంది? ద్రవ్యలోటు పరిస్థితీ అంతే. నిరుడు 62 వేల కోట్లకు ఖాయం చేశారు. ఈ ఏట సవరించిన అంచనాల్లో 73 వేల కోట్లకు చేరుతుందన్నారు. వచ్చే ఏట 79 వేల కోట్లుగా చూపారు. జిఎస్‌డిపిలో ద్రవ్యలోటును 4.38 శాతంగా అంచనా వేశారు. అప్పులు చేసి మూల ధన వ్యయం పెంచారా అంటే అదీ లేదు. ఆస్తుల సృష్టికి 40 వేల కోట్లకు పరిమితం చేశారు.

ఆశలపై నీళ్లు

కూటమి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను ప్రముఖంగా ప్రకటించగా అధికారంలోకొచ్చాక ఎనిమిది మాసాలయ్యాక, ఒక సంవత్సరం బడ్జెట్ పూర్తయ్యాక, మూడు పథకాలకే క్లారిటీ వచ్చింది. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఒక్కటే ప్రారంభమైంది. దానికీ అత్తెసరు కేటాయింపులు చేశారు. తల్లికి వందనం, రైతులకు రూ.20 వేల సాయం పథకాలను తొలేడాది అమలు చేయకుండా దాటవేశారు. రెండవ సంవత్సరం బడ్జెట్‌లో అవసరమైన విధంగా నిధులు ప్రతిపాదించలేదు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే నెలకు 3 వేల నిరుద్యోగ భృతి, 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1,500, బస్సుల్లో ఉచిత ప్రయాణం... ఈ మూడు పథకాలను బడ్జెట్‌లో విస్మరించారు.

ప్రధాన రంగాలకు నిరాశ

ఎ.పి.లో ఎ-అంటే అమరావతి, పి- అంటే పోలవరం అంటూ వచ్చారు. అమరావతికి అప్పులే దిక్కు. వేల కోట్ల పనులకు కాంట్రాక్టులని 6 వేల కోట్లే ప్రతిపాదించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధుల కోసం కేంద్రాన్ని అడుగుతామని చెప్పలేదు. బడ్జెట్‌లో ఆరు వేల కోట్లు చూపించారు. తెగ ప్రచారం చేసిన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు ఊసు లేదు. అప్పులపైనే ఆధారపడతారని అర్థమవుతోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం, తదితర వెనకబడ్డ, కరువు ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. మొత్తం బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు ప్రస్తుత ఏడాది కంటే వచ్చే ఏడాదిలో 24.73 నుంచి 23.98 శాతానికి, విద్య 11.37 నుంచి 10.80 శాతానికి, వైద్యం 6.2 నుంచి 5.98 శాతానికి తగ్గింది. ఆశించిన మేరకు ఆదాయం, కేంద్రం నుంచి సహాయం లభించకపోతే సంక్షేమ పథకాలకు, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల కోత పడుతుందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కార్పొరేట్లకు లాభించే విధంగా పి-4 లో వయబిలిటీ గ్యాప్ చెల్లింపునకు రూ.2 వేల కోట్లు ప్రతిపాదించారు.

FORM IV
(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWENARSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER PRAJASAKTI

1.	Place of Publication	: Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole, Ananthapuramu.
2.	Periodicity of its Publication	: Daily
3.	Printer's Name	: Mallajosyula Venkata Subrahmanya Sarma
	Nationality	: Indian
	Address	: D.No. 27-30-4, M.B.Vignana Kendram Akulavari Street, Governorpet, Vijayawada–520002, Andhra Pradesh.
4.	Publisher's Name	: Mallajosyula Venkata Subrahmanya Sarma
	Nationality	: Indian
	Address	: M.B.Vignana Kendram, D.No. 27-30-4 Akulavari Street, Governorpet, Vijayawada – 520002, Andhra Pradesh.
5.	Editor's Name	: Bendi Tulasi Das
	Nationality	: Indian
	Address	: D.No. 24-1-66, Devi Towers, Sambamurthy Road, Vijayawada–520002, Andhra Pradesh.
6.	Names and addresses of individuals	: Prajasakti Printers and Publishers Private Limited
	Who own the newspaper and Partners or Shareholders holding More than One percent of the total capital	: M.B.Vignana Kendram D.No. 27-30-4, Akulavari Street, Governorpet, Vijayawada – 520002, Andhra Pradesh.

I, Mallajosyula Venkata Subrahmanya Sarma hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(MALLAJOSYULA VENKATA SUBRAHMANYA SARMA)
Publisher

Date : 28.02.2025

వేతన జీవులను విస్మరించిన బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేతనజీవులను వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం విస్మరించిందని సిఐటియు పేర్కొంది. సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెగుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఎదురు చూసే వర్గాల ఆశలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అడియాసలు చేశారని పేర్కొంది. ఈ మేరకు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎటువంటి జీఓ ఇవ్వకుండానే మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం అన్యాయమన్నారు. ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ గురించి బడ్జెట్ ప్రస్తావించలేదని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీకి అదేగతి పట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి, ఐఆర్ ఊసే లేదని, వారికి చెల్లించాల్సిన వేలాదికోట్ల బకాయిల ప్రస్తావనలేదని, కేటాయింపులు కూడా లేవన్నారు, ప్రభుత్వ పథకాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లకు అవకాశాలు కల్పించే విషయంపై బడ్జెట్‌లో ఎక్కడా పేర్కొన లేదన్నారు. గత ప్రభుత్వ విచ్చిన్నంతో అప్పు తీసుకునే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా మిగిలిపోయిందని బడ్జెట్ ప్రసంగంలో ఒక వైపు పేర్కొంటూనే మరో వైపు 80 వేల కోట్ల అప్పులను ప్రతిపాదించారన్నారు. వేతనాలు,కూలి కోసం శ్రమ చేసి బతికే వారికెవ్వరికైనా సంక్షేమ పథకాలు మాత్రమే సంతృప్తిపరచలేవని 2024 ఎన్నికలఫలితాల్లో తేలిపోయిందన్నారు. గత అనుభవాలు నుంచైనా కూటమి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు పేర్కొన్నారు. కార్మికుల వేతనాలు,సంక్షేమం కోసం బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు బడ్జెట్‌లో మొండి చెయ్యి : సిఐటియు

ఆప్కాస్ ఉద్యోగులతో పాటు మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపిందని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పౌరుగుసేవల సిబ్బందికి ఎంతో కొంత ఊరటగా ఉన్న ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరి 6న జరిగిన మంత్రి వర్గ సమావేశం నిర్ణయించిందన్నారు. లక్ష మందికి పైగా ఉన్న ఆప్కాస్ కార్మికులు తమకు టైమ్ స్కేల్ జీతాలు చెల్లించిఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశించారన్నారు. కూటమి ప్రభుత్వం వారి ఆశలనే అడియాసలుగా మార్చిందని ఆయన పేర్కొన్నారు.

కేటాయింపులు .. కోతలు

● గృహ నిర్మాణ పద్దు తీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గృహ నిర్మాణశాఖకు వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా కనబడుతున్నప్పటికీ ఆచరణలో భారీగా కోతలు విధిస్తున్నట్లు స్పష్టమవుతోంది. 2025-26 వార్షిక బడ్జెట్‌లో రూ.6317.78 కోట్లు కేటాయించగా ఇందులో రెవెన్యూ కింద రూ.5,798.53కోట్లు, క్యాపిటల్ కింద రూ.519.24కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకాల కింద 2026మార్చి నాటికి 7లక్షల ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా జూన్ 2025 నాటికి 2లక్షల ఇళ్లను ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపి టిడ్కో) ద్వారా అందించనున్నట్లు ప్రభుత్వం శాసనసభలో స్పష్టం చేసింది. అంతేకాకుండా ప్రస్తుతం ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న ఆర్థిక సహాయానికి అదనంగా షెడ్యూల్ కులాల వారికి రూ.50వేలు, షెడ్యూల్డ్ తెగల వారికి అదనంగా రూ.75వేలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయింపులు, ఖర్చును గమనిస్తే కేటాయించింది రూ.4012.53కోట్లు కాగా, ఇందులో రెవెన్యూ కింద రూ.4011.53కోట్లు, క్యాపిటల్ పద్దు కింద కోటి రూపాయలు చూపించారు. ఇందులో కోతలు విధించి రూ.1611.82కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

'వ్యయ'సాగు!

● ధరల స్థిరీకరణకు నామమాత్రం ● సున్నా వడ్డీకి కూడా తక్కువే
● కార్పొరేట్ సేద్యానికి దారులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రాథమిక రంగం, అరవై శాతానికిపైగా ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో ప్రభుత్వాలు నిధులు ప్రతిపాదించడమే తప్ప ఖర్చు చేయట్లేదు. టిడిపి కూటమి సర్కారు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు నిధులు కొంత వరకు ఆశాజనకంగా ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా, చివరాఖరికొచ్చేసరికి పూర్తి స్థాయిలో ప్రతిపాదించిన నిధులు ఖర్చు చేస్తారా లేదా అన్న అనుమానం కలుగుతోంది. అందుక్కారణం గడచిన రెండేళ్ల అనుభవమే. 2023-24లో వ్యవసాయ, అనుంబంధ రంగాలకు రెవెన్యూ, కేపిటల్ రెండు పద్దులూ కలుపుకొని రూ.10,214 కోట్లు నికరంగా ఖర్చు చేశారు. ఆ సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయ, అనుంబంధ రంగాలకు ఖర్చు చేసింది 4.03 శాతం. 2024-25లో 12,534 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం బడ్జెట్‌లో 4.26 శాతం. కాగా సవరించిన అంచనాలదగ్గరకొచ్చేసరికి 6,150 కోట్ల (2.24 శాతం)కు తగ్గింది. ప్రతిపాదించిన బడ్జెట్‌లో సగానికి సగం పడిపోయింది. కాగా శుక్రవారంనాడు 2025-26 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాలకు 14,182 కోట్లు ప్రతిపాదించారు. సర్కారు ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్‌లో 4.40 శాతం ఆ రంగానికి ప్రతిపాదించారు. ప్రస్తుత ఏడాదిలో సవరించిన అంచనాల కంటే రెట్టింపు కేటాయించామంటున్నారు. కానీ అనుభవాన్ని గుర్తు తెచ్చుకుంటే ఎంతకు కుదిస్తారో తెలీదు. బడ్జెట్ ప్రతిపాదనలు ఘనంగా ఉన్నా చివరాఖరుకొచ్చేసరికి నికరంగా చేసిన ఖర్చును బట్టే ప్రభుత్వం ఆ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది. ఇదిలా ఉండగా, వచ్చే ఏడాదికి సూపర్ సిక్స్‌లోని అన్నదాతా సుఖీభవకు రూ.6,300 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో కౌలు రైతులు, పిఎం కిసాన్ లబ్ధిదారులు కలిపి తక్కువలో తక్కువ 68 లక్షల వరకు ఉంటారు. సొంత భూమి కలిగిన వారికి కేంద్రం ఇచ్చే 6 వేలు పోను 14 వేలు, కౌలు రైతులకు మొత్తంగా రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. మరో నాలుగు వేల కోట్ల వరకు అవసరమవుతాయని అంచనా. బడ్జెట్‌లో మాత్రం 6,300 కోట్లే పెట్టడంపై రైతులు, కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు ఏ మూలకూ సరిపోవు. రైతులు పంటలకు ధరల్లేక నష్టపోతున్న దశలో కనీసం 3 వేల కోట్లు అవసరమవుతాయని చెబుతున్నారు. రైతు రుణాలపై సున్నా వడ్డీ అమలుకు మూడు వేల కోట్ల వరకు కావాల్సి ఉండగా రూ.250 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రకృతి సేద్యం, డ్రోన్లు, టెక్నాలజీ పేరిట కార్పొరేట్, కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రవేశపెట్టే పలు కార్యక్రమాలను బడ్జెట్‌లో పొందుపర్చారు.

పాఠశాల విద్యకు 20శాతం నిధులివ్వాలి

● యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం తన బడ్జెట్‌లో 20శాతం నిధులు పాఠశాల విద్యకు కేటాయించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినా .. కేవలం 9.86శాతం మాత్రమే కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేశారు తక్కువ కేటాయింపులు చేయడం వల్ల విద్యారంగ బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగుతున్నదనే భావన ఏర్పడుతోందని అన్నారు. విద్యారంగానికి కేటాయించిన రూ.31,805 కోట్లు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఏమాత్రం సరిపోవని తెలిపారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యను విచ్ఛిన్నం చేసిందని, ఈ ప్రభుత్వమైనా పాఠశాల విద్యను అభివృద్ధి చేస్తుందని భావించామని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను చూస్తే గత ప్రభుత్వ బాటలోనే ఈ ప్రభుత్వం కూడా నడుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాడు - నేడు రెండో దశ కింద పూర్తిచేయని తరగతి గదులు అనేకం ఉన్నాయని, వీటి గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదని తెలిపారు. రాబోయే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామని చెబుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు కావాల్సిన తరగతి గదులు, వసతుల కోసం బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదని వివరించారు. 12వ పిఆర్‌సి, ఆర్థిక బకాయిల చెల్లింపు ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 2023 జులై 1 నుంచి రావాల్సిన 12వ పిఆర్‌సికి కనీసం ఛైర్మన్‌ను కూడా నియమించకపోవడం, పిఆర్‌సి అమలు చేసేలోపు ఐఆర్ ఇచ్చేందుకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమని తెలిపారు. వీటికోసం బడ్జెట్ కేటాయించాలని కోరారు.

విద్యారంగ బడ్జెట్ కేటాయింపుపై పునరాలోచన : ఎపిటిఎఫ్

రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అరకొర కేటాయింపులు చేయడం అన్యాయమని ఎపిటిఎఫ్ విమర్శించింది. కేవలం 10.8 శాతం కేటాయించడం వల్ల విద్యారంగ అభివృద్ధి ఏమాత్రం సాధ్యం కాదని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన విద్యారంగాన్ని గాడిలో పెట్టాలన్నా, ఢిల్లీ మోడల్‌ను మించిన ఆంధ్రా మోడల్ విద్యావ్యవస్థను రూపొందించాలన్నా కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి, బకాయిల చెల్లింపులు, ఐఆర్, పిఎఫ్ వంటి అంశాల గురించి బడ్జెట్‌లో ఏమాత్రం ప్రస్తావన చేయకపోవడంతో ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు నిరాశ ఎదురైందని పేర్కొన్నారు.

పిఆర్‌సి అమలుకు కేటాయింపులేవీ : ఎస్‌టియు

బడ్జెట్‌లో 12వ పిఆర్‌సి, ఐఆర్ అమలు కోసం నిధుల కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదని ఎస్‌టియు తెలిపింది. సిపిఎస్, జిపిఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేదని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యకు గతేడాది 10.15శాతం నిధులు కేటాయించగా, ప్రస్తుతం 9.86శాతమే కేటాయించారని వివరించారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన విధంగా నిధుల కేటాయింపు లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు.

'పోలవరం' పునరావాసంపై అదే నిర్లక్ష్యం

● కావాల్సింది రూ.18,746 కోట్లు
● కేటాయించింది రూ.1424 కోట్లు
● వెలిగొండకు రూ.300 కోట్లే !
● అత్యవసర పనుల కింద సిఇల ప్రతిపాదనల విలువే రూ.26,977 కోట్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపై కూటమి ప్రభుత్వం అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. పునరావాసానికి 18,746 కోట్లు అవసరం కాగా, కేవలం 1424 కోట్లు మాత్రమే కేటాయించారు. జలవనరులశాఖ అవసరాలకు, బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతనే లేదు. వెలిగొండ ప్రాజెక్టుకు అరకొర కేటాయింపులతోనే సరిపెట్టారు.. అదే సమయంలో రూ.10 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు. నీరు -చెట్టుకింద రూ.4600 కోట్లు చెల్లించామనీ తెలిపారు. వాస్తవంగా నీరుచెట్టు నిధులు ప్రాజెక్టుల పనులకూ సంబంధం లేదు. 2019-24 మధ్యకాలంలో చేపట్టిన పనుల తాలూకా పెండింగ్ బిల్లులను ఆఘమేఘాల మీద చెల్లించేశారు మినహా ఇరిగేషన్ ప్రాజెక్టుల బకాయిలను మాత్రం పూర్తిగా చెల్లించలేదు. అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు రూ.6705.19 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. 2027 నాటికి పూర్తి చేస్తామని చెబుతున్నా పునరావాసంపై స్పష్టత ఇవ్వలేదు. మొత్తం పునరావాసానికి రూ.33,470 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకూ రూ.8379 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.25,091 కోట్ల అవసరం ఉంది. ప్రస్తుత బడ్జెట్లో పునరావాసం, పునర్నిర్మాణానికి రూ.1415 కోట్లు, ఆర్అండ్ఆర్‌లోనే స్వతహాగా గృహాలు నిర్మించుకున్న వారికి రూ.8.46 కోట్లు మొత్తం రూ.1424 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. ఇది మొత్తం అవసరంలో ఐదుశాతం మాత్రమే. అదే సమయంలో ప్రాజెక్టు పనులు 73 శాతం పూర్తయ్యాయని ప్రసంగంలో ప్రస్తావించారు. అదే సమయంలో ఎల్అండ్ ఆర్అండ్ఆర్ మాత్రం 25.11 శాతమే పూర్తయిందని నివేదికల్లో పొందుపరిచారు. వాస్తవం గా పునరావాసం చేపట్టకుండా ప్రాజెక్టును పూర్తి చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైంది. అలాగే కీలకమైన వెలిగొండకు సుమారుగా రూ.3400 కోట్లు అవసరం ఉంటుందని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ప్రాజెక్టు ఆలస్యం కావడం వల్ల ఖర్చు ఊహించినదానికన్నా ఎక్కువ అవుతోందనీ తెలిపింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పినా రూ.395 కోట్లు మాత్రమే కేటాయించింది. పునరావాసానికి కూడా ఈ నిధులు సరిపోవు. అలాగే చింతలపూడి లిఫ్టు, పురుషోత్తపట్నం, కొండవీటివాగు, హంద్రీనీవా లిఫ్టులకు రూ.1490.71 కోట్లు కేటాయించారు. జైకా, ప్రపంచబ్యాంకు సంస్థల నుండి రూ.559 కోట్లు అప్పుల రూపంలో తీసుకోనున్నట్లు తెలిపారు. వీటిల్లో వరి నుండి హార్టికల్చర్‌కు, చేపల ఉత్పత్తి పెంచేందుకు, చిన్నచిన్న ఇరిగేషన్ ట్యాంకుల అభివృద్ధికి వినియోగించనున్నట్లు బడ్జెట్లో ప్రస్తావించారు. ఎస్‌సి లబ్ధిదార్లకు బోర్లు వేసేందుకు, భూగర్భజలాలు నిర్వహించేందుకు రూ.33.12 కోట్లు వెచ్చించారు. గుండ్లకమ్మ, తోటపల్లి ప్రాజెక్టుల పరిధిలో సాగు పెంచేందుకు వీలుగా రూ.14 కోట్లు, తాండవ రిజర్వాయర్ ఆయకట్టు స్థిరీకరణ, ఏలేరు రిజర్వాయర్ సాగు పెంపుదలకు రూ.2 కోట్లు వెచ్చించారు. ఏలేరు, ప్రాజెక్టు నిర్వహణ, విజయవాడలో రైతు శిక్షణా కేంద్రం నిర్వహణకు రూ.3.83 కోట్లు వెచ్చించారు. గోదావరి, నెల్లూరులోని పెన్నానదికి రెండువైపులా రక్షణ గోడల నిర్మాణం, కృష్ణానదిలో కిలోమీటరు దూరం రక్షణగోడ, నరసాపురంలోని బుడ్డిగవాని రేవు, వంశధారలో పలు ప్రాంతాల్లో వరద రక్షణ గోడల కోసం రూ.273.10 కోట్లు కేటాయించారు. గోదావరి డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు రూ.17.23 కోట్లు, కృష్ణాడెల్టా స్థిరీకరణ కోసం రూ.18.73 కోట్లు, పెన్నా డెల్టా డ్రైనేజీ నిర్వహణకు రూ.35.76 కోట్లు కేటాయించారు. మైనర్ ఇరిగేషన్ కింద సదుపాయాలు కల్పించేందుకు రూ.202.16 కోట్లు, లిఫ్టుల కింద సాగు పెంపుకోసం రూ.210 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మైనర్ ట్యాంకుల పునరుద్ధరణకు రూ.171 కోట్లు ప్రకటించారు. ఎన్‌టిఆర్ తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా సోమశిల స్వర్ణముఖి లింకు కెనాల్ నిర్మాణం, ఆయకట్టు స్థిరీకరణ, హైలెవల్ లిఫ్టు పనులకు రూ.657 కోట్లు కేటాయించారు. సంగం బ్యారేజీకి రూ.81.04 కోట్లు ఇచ్చారు. తుంగభద్ర బోర్డుకు రూ.318.31 కోట్లు కేటాయించారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌కు రూ.18 కోట్లు, ఇంటర్‌స్టేట్ వాటర్ రిసోర్స్‌కు రూ.7.77 కోట్లు నిధులు ప్రకటించారు. గాలేరు, నగరి ఒకటి, రెండుదశల ఆయకట్టు అభివృద్ధికి రూ.619.86 కోట్లు, అన్నమయ్య డ్యామ్ పునరుద్ధరణకు రూ.26.76 కోట్లు కేటాయించారు. అలాగే గండికోట ఆర్అండ్ఆర్‌కు రూ.36 కోట్లు ప్రకటించారు. అవుకు టన్నెల్‌కు రూ.5 కోట్లు, ఉత్తరాంధ్ర పరిధిలోని వంశధార స్టేజ్-1, తోటపల్లి బ్యారేజీ, వెంగళరాయసాగర్, గజపతినగరం బ్రాంచ్‌కెనాల్, టివి పెద్దేరు, మద్దులవలస ప్రాజెక్టుల్లో పనులు, ఆధునీకరణ, ఆయకట్టు స్థిరీకరణకు కాలువల నిర్వహణ కోసం రూ.54.72 కోట్లు కేటాయించారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు, మహేంద్రతనయ ఆఫ్‌షోర్, వంశధార ఫేజ్-2, హీరమండలం లిఫ్టు, తోటపల్లి, నాగావళి, వంశధార ఇంటర్‌లింకింగ్ ప్రాజెక్టు పనులకు రూ.307.40 కోట్లు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్లో ప్రస్తావించారు. మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకు రూ.68 కోట్లు వెచ్చిస్తామని తెలిపారు. ఆర్అండ్ఆర్‌కు సంబంధించి మహేంద్రతనయ, తారకరామతీర్థసాగర్, తోటపల్లి బ్యారేజీ నిర్వాసితుల కోసం రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మొత్తంగా ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.470.37 కోట్లు వెచ్చించనున్నారు. ప్రకాశం జిల్లాలో వెలిగొండ కాలువల నిర్వహణ, భూసేకరణకు సంబంధించి రూ.103.10 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అలాగే వెలిగొండ టన్నెల్స్ నిర్మాణం, గుండ్లకమ్మ రిజర్వాయర్ బిల్లులు, కొరిశపాడు లిఫ్టు ఇతర పనులకు రూ.139 కోట్లు ప్రకటించారు. వెలిగొండ ఆర్అండ్ఆర్‌కు రూ.116.89 కోట్లు మొత్తంగా ప్రకాశం జిల్లా పరిధిలో ప్రాజెక్టుకు రూ.507.16 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో జిల్లేడుబండ రిజర్వాయర్ బండ్, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్‌కు కలిపి రూ.1140 కోట్లు, కాలువల నిర్వహణ, నిర్మాణం, ఆర్అండ్ఆర్‌కు రూ.3447.04 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలోని రామాపురం, నిప్పులవాగు, కుందూనదిపై వంతెన, శ్రీశైలం రైట్ బ్రాంచ్ నిర్మాణాలకు రూ.263 కోట్లు ప్రతిపాదించారు. అలాగే జోలదరాసి, రాజోలి రిజర్వాయర్లకు రూ.30 కోట్లు, గురురాఘవేంద్ర లిఫ్టు ఇతర పనులకు రూ34 కోట్లు మొత్తంగా రూ.446.34 కోట్లు వెచ్చించనున్నారు. కృష్ణాడెల్టా సిస్టమ్స్‌కు రూ.701.29 కోట్లు కేటాయించారు.

పోలవరం కేటాయింపులు ఇలా

పోలవరం ప్రాజెక్టు పరిధిలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో ఎర్త్‌వర్క్, కాంక్రీటు పనులు, భూసేకరణకు రూ.2767.42 కోట్లు, డ్యామ్ పరిధిలో ఎర్త్‌వర్క్, కాంక్రీటు, 28496 ఎకరాల భూసేకరణకు రూ.2285.74 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టుల పరిధిలోని లిఫ్టు ఇరిగేషన్ స్కీములకు రూ.107 కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.1415.79 ఇతర ఖర్చులు అన్నీ కలిపి మొత్తంగా రూ.6705.19 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది



- బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమం, అభివృద్ధి, సుస్థిరపాలన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎపికి దిక్సూచిలా నిలుస్తుందని తెలిపారు. గత పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు ప్రతిక్షణం పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వీలుగా కేటాయింపులు జరిపామని పేర్కొన్నారు. కీలక రంగాలకు, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించామని చెప్పారు. స్వర్ణాంధ్ర -2047 విజన్‌లోని పది సూత్రాల లక్ష్యసాధనకు వారధిగా బడ్జెట్ నిలుస్తుందని వివరించారు. పేదరిక నిర్మూలనలో భాగంగా వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కింద రూ.2000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్‌సిక్స్ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చామని, అన్నదాత సుఖీభవ కోసం రూ.6300 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9407 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే బిసిలకు రూ.47,456 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆదరణ-3 పథకం కోసం రూ.1000 కోట్లు ప్రకటించి అండగా నిలిచామని తెలిపారు. బిసి వర్గాల గృహ నిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే సాయాన్ని ఈ ఏడాది నుండి రూ.20వేలు ఇవ్వబోతున్నామని వివరించారు. మత్స్యకారులకు ఆర్థికసాయం కింద రూ.230 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రైతన్నకు అండగా నిలిచేలా రూ.48,431 కోట్లు, జలవనరులశాఖకు రూ.18019 కోట్లు, విద్యాశాఖకు రూ.34311 కోట్లు, ఎస్‌సిలకు రూ.20218 కోట్లు, ఎస్‌టిలకు రూ.8159 కోట్లు, మైనార్టీలకు రూ.5434 కోట్లు ప్రకటించామని తెలిపారు. అభివృద్ధి ఉంటేనే ఆదాయం వస్తుందని, అందువల్లే ఆయా ప్రాజెక్టులకు సమృద్ధిగా నిధులు కేటాయించినట్లు వివరించారు.

రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టాలెక్కించే బడ్జెట్

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వార్షిక బడ్జెట్ కేటాయింపులు సంక్షేమం, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ఉన్నాయని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసిందని, తమ కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రెవిన్యూ లోటు , ద్రవ్యలోటు తగ్గించే చర్యలు చేపట్టిందన్నారు. అన్ని శాఖలకు కేటాయింపులు పెరగడంతో పాటు మూలధన వ్యయాన్ని రూ.40,636 కోట్లకు పెంచడం ద్వారా మౌలిక వసతులు రాష్ట్రంలో పెరుగుతాయన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర రాబడి పెంపుదలకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే అందిస్తున్న పింఛన్ల పెంపుదల, దీపం-2 పథకాలకు నిధులు కేటాయించడం ద్వారా సూపర్ సిక్స్ హామీల పట్ల కూటమి ప్రభుత్వం తన నిబంద్ధతను చాటుకుందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది మే నుంచి అమలు చేసేందుకు రూ.9,407కోట్లు , అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు సహాయం అందేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. సాగునీటి రంగానికి రూ.18,019కోట్లు కేటాయింపులు ఓ శుభపరిణామమన్నారు. జలజీవన్ మిషన్‌కు బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కిందన్నారు.

ప్రజాహిత బడ్జెట్ : పురందేశ్వరి



రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రజాహిత బడ్జెట్1 అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పురందేశ్వరి పేర్కొన్నారు. అసెంబ్లీలో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

- విద్యాశాఖ మంత్రి లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇది స్థానిక సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గిస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకాన్ని రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1 నుంచి 12వ తరగతి వరకు చదువుకునే ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని వర్తింపచేస్తామని వివరించారు. విద్యకు మొత్తంగా రూ.34,311 కోట్లు కేటాయించామని, గతేడాది కంటే రూ.2076కోట్లు అధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో తమ చిత్తశుద్ధికి అద్దం పడుతోందని తెలిపారు. రానున్న ఐదేళ్లల్లో ఎపి మోడల్ విద్యావ్యవస్థను తీసుకురావాలన్న తన సంకల్పానికి బడ్జెట్‌లో తాజాగా కేటాయించిన నిధులు దన్నుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. దీంతో రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆస్కారమేర్పడుతుందని పేర్కొన్నారు.

ఎవరికీ మేలు చేయని బడ్జెట్

శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎవరికీ మేలు చేయని విధంగా ఉందని వైసిపి శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీ బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ, . గత ప్రభుత్వాన్ని దూషించడం, సిఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌ను పొగడ్తలతో ముంచెత్తడానికే ప్రసంగం సరిపోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల కేటాయింపులు ఎక్కడా లేవని, సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేశారని అన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, నిరుద్యోగులకు రూ.3000, రైతులకు రూ.20 వేలు భరోసా అని చెప్పినా వాటికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో 81 లక్షల మంది విద్యార్థులు ఉంటే వారికి తల్లికి వందనం ఇవ్వాలంటే దాదాపు రూ.12 వేల కోట్లు కావాల్సి ఉండగా . రూ.9400 కోట్లే కేటాయించారని అన్నారు. 52 లక్షల మంది రైతులకు వైసిపి ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందని, అంతమందికీ ఇవ్వాలంటే రూ.12 వేల కోట్ల అవసరం ఉంటే అరకొర కేటాయింపులతో సరిపెట్టారని అన్నారు. . మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద గతంలో రూ.3000 కోట్లు కేటాయిస్తే ఈ ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించిందని విమర్శించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి నిలదీస్తుందన్నారు.. ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, బొమ్మి ఇజ్రాయిల్ కూడా బడ్జెట్‌ను విమర్శించారు.

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్ : కె.రామకృష్ణ



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలను మభ్యపెట్టేదిగా, మోసపూరితంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏలూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. రెవిన్యూ లోటు, ద్రవ్య లోటును ఆస్తులు విక్రయించడం ద్వారా, లేదా అప్పుల ద్వారా పూడుస్తారా? లేక ప్రజలపై భారాలు వేస్తారా? అనేది బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు అరకొరగా ఉన్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన నరేంద్ర మోడీని మంత్రి పొగడటం విడ్డూరంగా ఉందన్నారు.

అంకెల గారడీ : షర్మిల



కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్ సంఖ్యలు ఘనం, కేటాయింపులు శూన్యం అన్నచందంగా ఉందని పిసిసి చీఫ్ షర్మిల అన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను విస్మరించి బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలకు, ఇతర హామీలకు ఎగనామం పెట్టారని విమర్శించారు. ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వమని బడ్జెట్‌తో నిరూపితం అయ్యిందన్నారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు ఇవ్వడం రైతులకు ద్రోహం చేయడమేనని చెప్పారు. తల్లికి వందనం పథకానికి రూ.12,600 కోట్లు కావాల్సి ఉండగా, రూ.9,407 కోట్లే కేటాయించారని తెలిపారు. అంటే రూ.3 వేల కోట్ల మేర విద్యార్థుల సంఖ్యలో కోత పెడతారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు.

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు

బడ్జెట్‌పై సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీలో రూ. 3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్...రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదని, పైగా లక్షల కోట్లు అదనంగా అప్పు తేబోతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. దీనిపై శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తే 80 వేల కోట్ల రూపాయల ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉందని, పన్ను ఆదాయం రూ.14 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.12 వేల కోట్లు పెంచి చూపడం ద్వారా ఇది ప్రజలపై భారాలు పెంచుతుంది లేదా అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాలకు కోతపెట్టే ప్రమాదముందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.. అన్ని పథకాలకు కేటాయింపులు చూపడం కోసం ఆచరణాత్మకం కాని ప్రతిపాదనలు చేసినట్లు అనిపిస్తోందన్నారు. ప్రజలకు పెను భారంగా మారిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల విధింపు గురించి ప్రస్తావించిన మంత్రివర్యులు రాష్ట్రాన్ని పాతికేళ్లపాటు దోచుకుతినే సెకి ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి పల్లెత్తు మాట అనకపోవడం దారుణమని అన్నారు.. ప్రతిపక్షంలో ఉండగా మీడియాకు పుంఖాను పుంఖాలుగా చెప్పడం, హైకోర్టుకు సైతం ఎక్కిన ప్రస్తుత ఆర్థిక శాఖామంత్రి ఇప్పుడు ఈ అంశంపై పెదవి విప్పకపోవడం ప్రజలను వంచించడమేనని విమర్శించారు. వ్యవసాయం, ఇరిగేషన్, సంక్షేమ కార్యక్రమాలకు గత బడ్జెట్‌కన్నా పెరుగుదల పెద్దగా లేదని, పైగా తల్లికి వందనం కేటాయింపులు తగ్గాయని తెలిపారు.

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు కేటాయింపులు చూపినా టిడిపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న యువతకు నిరుద్యోగ భృతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు.. ఇప్పటికే మెగా డిఎస్‌సి రాకపోవడం, గ్రూప్-2 పరీక్ష విషయంలో నిరాశ చెందిన యువతకు ఈ బడ్జెట్ హతాశులను చేసిందన్నారు. ఆప్కాస్ రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు పద్దతి పునరుద్ధరించడం ఉద్యోగులు, కార్మికులను అభద్రతకు గురిచేస్తుంది. గత ఏడాది ఆందోళన చేసిన అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్లకు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు అధికారానికి వచ్చిన కూటమి తాజా బడ్జెట్‌లో వారికి మొండిచెయ్యి చూపడం 'ఏరు దాటే వరకు ఓడ మలయ్య' సామెతను గుర్తు చేస్తోందని తెలిపారు.

ఇరిగేషన్ కేటాయింపులు రూ.14 వేల కోట్లు నుండి రూ.17 వేల కోట్లకు పెరిగినప్పటికీ మొత్తం బడ్జెట్‌లో ఇది 24.73 శాతం నుండి 23.98 శాతానికి తగ్గిందంటే తన వ్యయ ప్రాధాన్యత ఏమిటో విదితమవుతోందని విమర్శించారు. విద్యలోనూ కేటాయింపులు 11.37 శాతం నుండి 10.8 శాతానికి, వైద్యానికి 6.2 శాతం నుండి 5.98 శాతానికి తగ్గించడం, మానవాభివృద్ధి సూచికల మెరుగుదలపై ప్రభుత్వం దృష్టి ఎలా ఉన్నదీ విదితమవుతోందని తెలిపారు. బడ్జెట్‌లో దాదాపు మూడో వంతు మొత్తం 1.02 లక్షల కోట్లు అప్పుపైనే ఆధారపడిన స్థితిలో ఏది ఎంత వరకు ఆచరణకొస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని, ఒకవైపు అప్పులు, లోటు పెరుగుతున్నా మరోవైపు కార్పొరేట్లకు 20 శాతం వయబిలిటీ గ్యాప్ పేరుతో కేటాయించడం ప్రభుత్వం సంపన్నుల కొమ్ము కాస్తున్నదనడానికి నిదర్శనమని విమర్శించారు. గత ప్రభుత్వం కన్నా ఎక్కువగా అప్పుల ఊబి, భారాల మోత తప్పని స్థితిని ప్రభుత్వం తీసుకొస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి భారాలు పడకుండా ఎదుర్కోవాలని శ్రీనివాసరావు సూచించారు.

ప్రజల ఆకాంక్షలకు దూరంగా బడ్జెట్

- పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ సాధారణ ప్రజానీకం ఆకాంక్షలను, వాస్తవికతను ప్రతిబింబించేదిగా లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విమర్శించారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, బి గోపిమూర్తి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. లక్ష్మణరావు మాట్లాడుతూ బడ్జెట్ రూ.3.22లక్షల కోట్లతో ప్రతిపాదించినా ఆదాయ వనరులు ఎలా పొందుతారనే అంశాలపై స్పష్టత లేదన్నారు. ముఖ్యంగా కేంద్ర నిధుల ప్రస్తావన లేదన్నారు. మిర్చి, పత్తి, శనగ పంటల ధరలు పడిపోయి రైతులు సంక్షోభంలో ఉన్న సమయంలో ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.9వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల గురించే తప్ప మిగిలిన వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి వాటి ఊసేలేదన్నారు. పాఠశాల విద్యకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవన్నారు.. ఉన్నత విద్యకు రూ.2500కోట్లు కేటాయించామని చెప్పిన ఆర్థిక మంత్రి, ఖాళీగా ఉన్న 5వేల పోస్టుల భర్తీ గురించి అసలు ప్రస్తావించనేలేదని చెప్పారు. ప్రభుత్వ రంగంలో 1.40లక్షల పోస్టులు ఖాళీల భర్తీ గానీ, జాబ్ క్యాలెండర్ గురించి కానీ ప్రస్తావించలేదన్నారు. ఇప్పటి వరకు డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయకుండానే వాగ్దానాన్ని నెరవేర్చినట్లు ఆర్థిక మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.. వైద్య, ఆరోగ్యశాఖలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచన కనపడిందన్నారు. ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంకెలు ఘనంగా ఉన్నా అంచనాలు తారుమారుగా ఉంటాయన్నారు.. సవరించిన అంచనాలకు, బడ్జెట్ అంచనాలకు చాలా తేడా ఉందన్నారు. కేటాయింపులపై అనుమానం ఉందన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు లబ్ధిదారుల సంఖ్యకు తగ్గట్లుగా కేటాయింపులు లేవని చెప్పారు. గోపి మూర్తి మాట్లాడుతూ 12వ పిఆర్‌సి అమలు చేసేందుకు నిధులు కేటాయిస్తారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూశారని, కానీ బడ్జెట్‌లో వారికి మొండిచెయ్యి చూపించారని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితుల గురించి ప్రస్తావించలేదని చెప్పారు.

ఏప్రిల్ నుండి ఎవరి నిధులు వారికే

పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏప్రిల్ నుండి మున్సిపాలిటీ నిధులను ఆయా మున్సిపాలిటీల్లో ఖర్చు చేసేలా బడ్జెట్లో ప్రకటించడం హర్షణీయమని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందని తెలిపారు. బడ్జెట్లో మున్సిపల్ శాఖకు రూ.13 వేల కోట్లు కేటాయించారని, సిఆర్‌డిఏకు రూ.6000 వేల కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేలా బడ్జెట్ ఉందని వివరించారు. అమరావతిలో సంస్థలకు భూములు కేటాయించిన తరువాత మిగిలిన భూమిని అమ్మడం ద్వారా నిధులు సేకరిస్తామని. మూడేళ్లలో అమరావతిని నిర్మిస్తామని చెప్పారు.




వ్యవసాయ బడ్జెట్‌కు రూ.48,341 కోట్లు

- శాసనసభలో ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- అన్నదాతా సుఖీభవకు రూ.9,400 కోట్లు
- సాగునీటి పారుదలకు రూ.12,903.41 కోట్లు
- ఉపాధి హామీకి రూ.6,026.87 కోట్లు
- ఉచిత విద్యుత్‌కు రూ.12,773.25 కోట్లు
- చేపల వేట నిషేధ భృతి రూ.20 వేలకు పెంపు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రూ.48,341.14 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కె. అచ్చెన్నాయుడు శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'వ్యవసాయం మేధోపరంగా, సంతృప్తికరంగా, లాభదాయకంగా మారితే, అది ఉద్యోగ ఆధారిత ఆర్థిక వృద్ధిని ప్రేరేపిస్తుందన్న ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం ఎస్ స్వామినాథన్ మాటలను ఉటంకించారు.. బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.12,401.58 కోట్లు కేటాయించినట్లు మంత్రి చెప్పారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్‌కు రూ.9,400 కోట్లు ప్రతిపాదించినట్లు చెప్పారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేస్తామన్నారు. కొత్త కౌలు చట్టం తీసుకురానున్నట్లు తెలిపారు. పంటల బీమాకు రూ.1,023 కోట్లు, వడ్డీ లేని రుణాల కోసం రూ.250 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219.65 కోట్లు, విత్తన రాయితీకి రూ.240 కోట్లు, ఎరువుల బఫర్ స్టాక్ కోసం రూ.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు వ్యవసాయ రంగంలో 15 శాతం వార్షిక వృద్ధిని సాధించడానికి 11 వ్యవసాయ పంటలను గ్రోత్ ఇంజన్లుగా గుర్తించినట్లు చెప్పారు. 2024-25లో వ్యవసాయంలో 22.86 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఉద్యాన శాఖకు రూ.930.88 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించామన్నారు. అధిక జివిఎ సమకూర్చే 11 ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖకు రూ.96.22 కోట్లు కేటాయించామన్నారు. మార్కెటింగ్ శాఖకు రూ.315.32 కోట్లు కేటాయించామన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు కోసం రూ.300 కోట్లు ప్రతిపాదించినట్లు చెప్పారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు 'సహకార్ సే సంవృద్ధి' కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. సహకార శాఖకు రూ.239.85 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పశు సంవర్ధక శాఖకు రూ.1,112.07 కోట్లు ప్రతిపాదించామన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు మత్స్య, ఆక్వా రంగాలను గ్రోత్ ఇంజన్లుగా గుర్తించినట్లు చెప్పారు. సముద్ర, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల విలువలో రూ.19,420 కోట్లతో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. అర్హులైన మత్స్యకారులకు చేపల వేట నిషేధ కాల భృతిని రూ.10 నుంచి 20 వేలకు పెంచామని తెలిపారు. 1,22,966 మంది మత్స్యకారులకు, కుటుంబానికి రూ.20 వేల చొప్పున రూ.245.93 కోట్లు ఈ ఏడాది వేట కాలానికి ముందే విడుదల చేస్తున్నట్లు చెప్పారు. పులికాట్ సరస్సులో 20 వేల మత్స్యకారుల కుటుంబాల కోసం వాకాడు మండలం రాయదరువు వద్ద సముద్ర ముఖద్వారం తెరవడం కోసం రూ.97.09 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. మత్స్యశాఖకు రూ.540.18 కోట్లు ప్రతిపాదించామన్నారు. అదే విధంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో రూ.507.01 కోట్లు, వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.98.21 కోట్లు, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యాలయానికి రూ.154.57 కోట్లు, ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయానికి రూ.38 కోట్లు కేటాయించామని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.12,773.25 కోట్లు, ఉపాధి హామీ కింద వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల కోసం రూ.6026.87 కోట్లు కేటాయించినట్లు, ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసేందుకు ఎన్టీఆర్ జలసిరి పథకానికి రూ.50 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.12,903.41 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.




'పన్ను'పోటు తప్పదా! బడ్జెట్ మతలబు ఇదేనా?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తాజా బడ్జెట్ కూర్పు గమనిస్తే ప్రజలపై పన్నుల భారం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుంటుండటంతో పాటు, ఇప్పటికే 80 వేల కోట్ల రూపాయలు ద్రవ్యలోటు ఉండటం దీనికి కారణం. నేరుగా పన్నుల ప్రస్తావన లేకపోయినప్పటికీ, బడ్జెట్ మతలబు ఇదేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా బడ్జెట్‌ను 3.22 లక్షల కోట్లతో ప్రతిపాదించారు. అయితే ఆదాయం మాత్రం 2.17 లక్షల కోట్ల వరకే చూపించారు. అంటే దాదాపు 1.05 లక్షల కోట్ల వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ అంతరాన్ని భర్తీ చేసుకునేందుకు అంతే మొత్తాన్ని రుణంగా తీసుకుంటున్న ప్రతిపాదించారు. ఈ భారం ఏదో రూపంలో ప్రజలపై మోపక తప్పదన్న సంగతి తెలిసిందే. ఎఫ్‌ఆర్‌బిఎం నిబంధనల మేరకు లోటు పరిమితులను పాటించాలన్నా ఆ దానిని ఎంతో కొంత మేరకు బర్తీ చేయక తప్పని స్థితి నెలకొంది. రాష్ట్ర పన్నుల, పన్నేతర ఆదాయాన్ని కూడా గణనీయంగా పెరగనున్నట్లు బడ్జెట్లో చూపించారు. రాష్ట్ర సొంత పన్నుల ద్వారా గతేడాది 1.09 లక్షల కోట్లు వస్తాయని ప్రతిపాదించగా, కేవలం 94,966 కోట్లు మాత్రమే వచ్చాయి. అయితే కొత్త బడ్జెట్‌లో గత ప్రతిపాదనకు సమానంగా మళ్లీ 1.09 లక్షల కోట్లరూపాయలను ప్రతిపాదించారు. అయితే, దీనికున్న వనరులను గురించి నామమాత్రపు ప్రస్తావన కూడా లేదు. పన్నేతర ఆదాయాన్ని కూడా 12 వేల కోట్ల రూపాయలు పెంచి చూపించడం కూడా విస్మరించలేని అంశం. దీంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలపై భారాలు మోపడానికే ప్రభుత్వం సిద్ధమౌతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మద్యంపై అదనపు వ్యాట్, భూముల ధరలను క్రమబదీందకరించడం, సేవలపై పన్నుల విధించడం వంటి చర్యలు ప్రభుత్వం దిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెస్‌లను కూడా వేసే అవకాశం ఉందని అంటున్నారు. సంక్షేమ పథకాలను సజావుగా నిర్వహించాలన్నా ప్రజలపై పన్నుల భారం మోపక తప్పదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



రుణాలు లక్ష కోట్లకు పైనే

- బడ్జెట్‌లో 32శాతం అప్పులే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో రుణాలను తీసుకుంటోంది. మొత్తం బడ్జెట్‌లో 32శాతం దాకా రుణాలే ఉండటం గమనార్హం. మొత్తం 3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో రుణాల ద్వారానే 1,04,382 కోట్లు సేకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలం ద్వారానే 80,456 కోట్ల రుణాలు తెచ్చుకోవాలని నిర్ణయించారు. అలాగే కేంద్రం నుంచి వివిధ పథకాల కింద మరో 21,700 కోట్లు రుణంగా వస్తుందని అంచనా వేశారు. డిపాజిట్ ట్రాన్సాక్షన్ ద్వారా 700 కోట్లు, ఇతర రుణాల ద్వారా 1,500 కోట్లు, లోన్స్ అడ్వాన్సుల ద్వారా 26 కోట్ల రూపాయల వరకు వస్తాయని ప్రతిపాదించారు.

గత ఏడాది బహిరంగ మార్కెట్ ద్వారా 71 వేల కోట్లు రుణ సమీకరణ చేయాలని నిర్ణయించగా, ప్రస్తుతం ఆ సంఖ్య 80 వేల కోట్ల వరకు చేరిపోయింది. అంటే కొత్త సంవత్సరంలో ప్రతిపాదించిన 80,456 కోట్లు కూడా పరిమితి దాటిపోయి 90 వేల కోట్ల వరకు వెళ్లిపోయే పరిస్థితి ఉంటుందని, దీంతో మొత్తం రుణాలు కూడా 1.14 లక్షల కోట్లకు చేరుకుంటాయని భావిస్తున్నారు.

ఇవీ రాష్ట్ర ప్రభుత్వ రుణాల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	గతేడాది	తాజా ప్రతిపాదన
ఓపెన్ మార్కెట్	71,000	80,456
కేంద్ర రుణాలు	18,250	21,700
ఇతర రుణాలు	2,193	1,500
డిపాజిట్లపై	1,799	700
అడ్వాన్సులు	12	26
మొత్తం	93,254	1,04,382

'ఉపాధి'కి కోత

- సవరించిన అంచనాలే నిదర్శనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళిత, గిరిజనులు, ఇతర వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీకి కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం అంకెల గారడీ చేసింది. గత బడ్జెట్‌లో రూ.5,414.72 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.5,956.40 కోట్లకు పెంచింది. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాలను పరిశీలిస్తే అసలు మతలబు స్పష్టమవుతుంది. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,414.72 కోట్లను సవరించి 2,255.49 కోట్లకు తగ్గించింది. అంటే కేటాయించిన నిధుల్లో సగానికిపైగా కోత వేసింది. 2023-24లో వాస్తవ ఖర్చును పరిశీలిస్తే రూ.2,658.27 కోట్లుగా ఉంది. ప్రభుత్వం కేటాయింపుల్లో ఎక్కువ మొత్తం చూపడం, సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని తగ్గించడం వల్ల ఉపాధి హామీ లక్ష్యం నెరవేరే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంలో వెనుకబడిన కొన్ని ప్రాంతాల నుంచి పనుల కోసం వలసలు తప్పడం లేదు. ఉపాధిలో జాబ్ కార్డులను వివిధ కారణాలతో గత మూడేళ్లుగా తొలగించారు.

డ్వాక్రా సభ్యుల వడ్డీ లేని రుణాలకు మంగళం

గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రస్తుత బడ్జెట్‌లో 8,033.16 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. బడ్జెట్‌లో కేటాయింపుల వరకూ ఈ అంకెలు పరిమితమవుతున్నాయి. 2024-25 బడ్జెట్‌లో కేటాయింపులు, సవరించిన అంచనాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. కేటాయింపులు రూ.7,949.87 కోట్లు ఉండగా సవరించిన అంచనాల్లో దీనిని రూ.3,748 కోట్లకు తగ్గించడం విశేషం. 2023-24లో ఈ శాఖలో వాస్తవ వ్యయం రూ.4,623.77 కోట్లుగా ఉంది. డ్వాక్రా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల కోసం 2024-25లో 950 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాల్లో కేటాయింపులు లేకుండా చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లోను ఇందుకు నిధులను రూ.850 కోట్లు తగ్గించి, కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎపి తాగునీటి సరఫరా సంస్థకు గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.

సంపాదకీయం


'కొనుగోలు' శక్తి!

దేశంలోని వంద కోట్ల మందికిపైగా ప్రజలు వస్తు, సేవలకు వినియోగదార్లయ్యేందుకు వారికి కొనుగోలు శక్తి లేదని బ్లూమ్ వెంచర్స్ ఇటీవల వెల్లడించిన నివేదికతో అయినా మన పాలకులు కళ్లు తెరుస్తారేమో చూడాలి. 'భారత్ వెలిగిపోతోంది' అంటూ పాలకవర్గాలు పదేపదే ఊదర గొడుతుంటే అదేం లేదు మెజారిటీ భారత దేశం కునారిల్లిపోతోంది అని ప్రజానుకూల ఆర్థికవేత్తలు చెబుతూనే వున్నారు. మార్కెట్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాస్తవాలను వివరిస్తూ ప్రపంచ బడా కార్పొరేట్లకు మార్గనిర్దేశనం చేసేలాంటి బ్లూమ్‌బెర్గ్ సంస్థ నుండి ఇటువంటి నిర్ధారణలు వెల్లడయ్యాకనైనా వారికి తత్వం బోధపడుతుందా! దేశ జనాభాలోని 30 కోట్ల మంది తమ ఆహార ఖర్చులకు, అత్యవసర ఖర్చులకూ అవసరమైన డబ్బు మాత్రమే ఉంటోందని నివేదిక పేర్కొన్నది. ఇక మిగిలిన 13-14 కోట్ల మంది మాత్రమే మార్కెట్‌లో ఏవైనా సరుకులు లేదా ఖరీదైన సేవలకు వినియోగదారులుగా ఉన్నారని తేల్చి చెప్పింది. అంటే దేశ జనాభాలో దాదాపు పది శాతం మంది మాత్రమే! కాబట్టి అత్యధిక మంది ఆదాయాలు కుంగిపోయి అలా అలా దిగజారుతున్నారనీ, కొద్ది మంది మాత్రమే అధికాదాయాలతో సంపన్నులవుతున్నారని స్పష్టమవుతోంది. ఆర్థిక వృద్ధిలో ఇది ప్రగతిశీల ఆర్థికవేత్తలు వివరిస్తున్న ఇంగ్లీషు అక్షరం 'కె' నమూనాను వ్యక్తం చేస్తోంది కదా! కోవిడ్‌తో ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిన్నదనీ అయితే అది మరింత పుంజుకొని, ఇంగ్లీషు అక్షరం 'వి' నమూనాలో పైకెగుస్తుందనీ, అందుకే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ అంటూ నీతి ఆయోగ్ మొదలు ప్రధాని మోడీ వరకు గొప్పలు చెప్పారు. అది తప్పని బ్లూమ్‌బెర్గ్ వెంచర్స్ తాజా నివేదిక కూడా తేల్చి చెప్పింది.

కాబట్టి ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి ఇప్పుడు కావలసింది ప్రజల కొనుగోలు శక్తి పెరగడం. అది కూడా సామాన్యులు, నిరుపేదలకు ఆదాయాలు వస్తేనే వినిమయం పెరుగుతుంది. ఎందుకంటే పేదవారికి వచ్చే ప్రతీ రూపాయినీ వారు ఖర్చు చేస్తారు. అదే సంపన్నులకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే వారు వినిమయం కోసం ఖర్చు చేస్తారు. మార్కెట్‌లో తగినంత డిమాండ్ ఉన్నప్పుడే పెట్టుబడిదారులు పెట్టుబడులతో ముందుకొస్తారు తప్ప సమ్మిట్‌లు, ప్రెజెంటేషన్లతో మాత్రమే కాదు. స్థూల వినిమయం తగ్గుతున్నప్పుడు వారు పెట్టుబడులు అదనంగా పెట్టడానికి ముందుకు రారు. దాని వలన సంక్షోభం మరింత ముదిరిపోతుంది. 1930 దశకానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్థకుడు. ఈ సంక్షోభం ముదిరితే అది పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే తిరుగుబాట్లకు దారి తీయవచ్చునని ఆయన భయపడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవాలంటే స్థూల డిమాండ్‌ను పెంచాల్సిందేనని, అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలని సూచించాడు. ఆనాడు మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచం ఆ దిశగా నడిచింది కూడా. అప్పుడు ముందుకొచ్చిందే శ్రేయోరాజ్య భావన కూడా! కాని ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచంలో సరిగ్గా కీన్స్ చెప్పినదానికి భిన్నమైన దిశగా జరుగుతోంది. దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

ఇప్పుడు దేశం ముందుకెళ్లాలన్నా, ఆర్థిక వ్యవస్థ సంక్షోభం మరింత ముదరకూడదనుకున్నా ప్రజల ఆదాయాలు పెంచడం తప్పనిసరి. అందుకు ప్రభుత్వ వ్యయం పెంచడమే సరైన పరిష్కారం. అందుకనుగుణమైన చర్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. రైతు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. ప్రజా బాహుళ్యానికి అటు పని, ఇటు ఆదాయాలతోపాటు ప్రజల సంపద పెంచే గ్రామీణ ఉపాధి హామీ పనులను విస్తారంగా చేపట్టాలి. పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి చట్టాన్ని విస్తరించాలి. ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనపై ఖర్చు పెంచాలి. శ్రామికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనాలను గ్యారంటీ చేయాలి. ఇటువంటి చర్యల ద్వారా ప్రజలందరి చేతుల్లోకి డబ్బు వస్తేనే మార్కెట్‌లో వస్తు, సేవలను వారు వినియోగిస్తారు. అప్పుడే ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది. ఈ దిశగా పాలకులు ఆలోచించాలి. లేకపోతే అందుకు ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి పెంచాలి. బ్లూమ్‌బెర్గ్ వెంచర్స్ నివేదిక నుండి తీసుకోవలసిన గుణపాఠం ఇదే!

మహనీయుల మాట



చిరునవ్వే దయాగుణానికి సంబంధించిన అంతర్జాతీయ భాష. చెవిటి వాళ్ళు వినగలిగేది, గుడ్డి వాళ్ళు చూడగలిగేది కేవలం దయాగుణాన్ని మాత్రమే.

- మార్క్ ట్వైన్,
ప్రపంచ ప్రసిద్ధ రచయిత.

వ్యాఖ్య

అమెరికా సాయంపై దాగుడు మూతలు

> **ట్రంప్ ప్రభుత్వ వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయనీ ప్రభుత్వం దానిపై పరిశీలన జరుపుతున్నదనీ విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతకు మించి అసలు ఈ చెబుతున్న వాటిలో ఏమైనా నిజముందా లేదా అనేదానిపై మంత్రి పూర్తి మౌనమే వహించారు. కొన్ని మీడియా సంస్థలైతే ఈ నిధులు ఇండియా కోసం కాదనీ బంగ్లాదేశ్ కోసం ఉద్దేశించినవనీ వార్తలు ఇచ్చాయి. ట్రంప్ ఢాకాను ఢిల్లీ అని పొరబడి వుండొచ్చని చెప్పాయి. ఈ రకమైన వివరణ ఆశ్చర్యకరంగా వుండొచ్చు. ఏమైనా భారత దేశ వ్యవహారాల్లో యు.ఎస్.ఎయిడ్ జోక్యందారీ కార్యకలాపాలేమిటన్న దానిపై స్పష్టమైన పారదర్శకమైన వివరాలు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంటుంది.**



> **యు.ఎస్.ఎయిడ్ నిధుల పూర్తి వివరాలు, ఆ ప్రాజెక్టుల స్వభావం, భారతదేశ అంతర్గత వ్యవహారాలలో దాని చొరబాటు తప్పక బయటికి తేవాలి. తన వ్యాపార ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ప్రభుత్వ విధానాలను అమెరికా ఏ విధంగా ప్రభావితం చేసిందో తెలుసుకోవలసిన హక్కు భారతీయులకు ఉంది. అంతకన్నా ముఖ్యంగా యు.ఎస్.ఎయిడ్ ద్వారా అమెరికా రాజకీయ ప్రభావం ఏ మేరకు నడించిందో తెలుసుకోవలసిన హక్కు మనకుంది. దేశ సమైక్యత, సార్వభౌమత్వాల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం తన స్వచ్ఛతను నిరూపించుకోవడం అవసరం.**

అంతర్జాతీయ అభివృద్ధికి సహాయం అందించేందుకు సంబంధించిన తమ సంస్థ (యు.ఎస్.ఎయిడ్)ను మూసేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పాలక పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ఇది ఒక ముష్టి యుద్ధానికి దారితీసింది. ఈ మూసివేత నిర్ణయంతో పాటు యు.ఎస్.ఎయిడ్ నిధుల గ్రహీతలుగా వున్న వారి జాబితా కూడా ప్రకటితమైంది. ఈ జాబితా ఆధారంగా భారతదేశంలో ఓటింగ్ శాతం పెంపుదల కోసం 2.1 కోట్ల డాలర్ల నిధులు అందినట్టు ట్రంప్ చెబుతున్నారు. ఆయన ఎవరో ఒకరిని ఎన్నికయ్యేలా చేసేందుకోసం ఈ నిధులు ఉద్దేశించాయంటూ ట్రంప్ ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లారు. దీని కొనసాగింపుగా మరో ముఖాముఖిలో 'ఓటింగ్ శాతం పెంపుదల కోసం ఈ నిధి భారతదేశంలోని తన స్నేహితుడు మోడీకి చేరింద'ని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ ప్రకటనలను తీవ్రంగా పరిశీలించవలసిన అవసరముంది. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాలి. నిజమని తేలేట్టయితే గనక ఇది మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో విదేశీ శక్తుల ప్రత్యక్ష జోక్యం తప్ప మరొకటి కాబోదు. కనుక ఈ డబ్బు నిజంగా ఏ ప్రయోజనాల కోసం ఎవరికి చేరింది, తెలుసుకునే హక్కు మనకుంది.

లోతైన కారణాలివే

యు.ఎస్.ఎయిడ్ అనేది ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా అవసరమైన దేశాలకు, సమాజాలకు సహాయం అందజేసే అమాయకమైన సంస్థ ఏమీ కాదు. అమెరికా విదేశాంగ శాఖ వ్యవహారాల కొనసాగింపుగానే అది పనిచేస్తుంది. దాని దుందుడుకు విదేశాంగ విధాన ప్రయోజనాలను ముందుకు తీసుకుపోవడానికే పనిచేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నాటి సోవియట్ యూనియన్ ప్రభావాన్ని వెనక్కు కొట్టడానికే జాన్ ఎఫ్ కెనడీ యు.ఎస్.ఎయిడ్ నెలకొల్పారు. అప్పటి నుంచి ఆ యా దేశాలలో ప్రభుత్వాల మార్పులోనూ అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడి సోషలిస్టు ఉద్యమాలను అణచివేయడంలోనూ అది ముఖ్య పాత్ర వహించింది.

ఇటీవల అంటే 2023లో కూడా మెక్సికో మాజీ అధ్యక్షుడు ఆంద్రూ మాన్యుయేల్ లోపెజ్ ఒబ్రడార్ తన దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని ఖండించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకమై గ్రూపులకు యు.ఎస్.ఎయిడ్ నిధులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. 2014లో యు.ఎస్.ఎయిడ్ క్యూబన్ ట్విటర్ వేదికగా జున్‌జునే అన్న ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసి సోషలిస్టు క్యూబాలో అశాంతి, అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించింది. అమెరికా ప్రయోజనలకు ముప్పుగా పరిగణించే ప్రభుత్వాలను మార్చివేయడానికి తామిచ్చే సహాయాన్ని సాధనంగా వాడటమనేది కొత్త లక్షణమేమీ కాదు. భారత దేశానికి ఈ విషయంలో మినహాయింపు కూడా లేదు. కేరళలో ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ సహాయాన్ని ఎలా వినియోగించిందో సాక్ష్యాధారాలతో సహా బయటపడింది.

కమ్యూనిస్టులపై రెండు సార్లు కుట్ర!

1957-59 మధ్య అంటే కేరళలో ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన సమయంలో భారతదేశంలో పనిచేసిన అమెరికా మాజీ రాయబారి ఎల్స్‌వర్త్ బంకర్ ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. "మేము కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం చేశామన్నది వాస్తవం' అని ఆయన చెప్పారు. ఆ ప్రభుత్వాన్ని తర్వాత రద్దు చేసిన సంగతి కూడా తెలిసిందే. బంకర్ వాస్తవాలు బయటపెట్టిన సంచలన ఈ ఇంటర్వ్యూ పాఠం రికార్డులు కొలంబియా విశ్వవిద్యాలయం మౌఖిక చరిత్ర విభాగం ఆర్కైవ్స్‌లో అందుబాటులో వున్నాయి.

అదే విధంగా 1973-75 మధ్య భారత దేశంలో పనిచేసిన అమెరికా రాయబారి డేనియల్ పాట్రిక్ మొయిన్‌హాన్ ఇలాంటి మరో ఒప్పుకోలు ప్రకటన చేశారు. ప్రమాదకర శాంతి (డేంజరస్ పీస్) అనే తన పుస్తకంలో మోయిన్‌హాన్ కమ్యూనిస్టుల పట్టును ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్ పార్టీకి అమెరికా రెండు సందర్భాల్లో ఒకసారి కేరళలో మరోసారి పశ్చిమ బెంగాల్‌లో నిధులు సమకూర్చిందని వెల్లడించారు. భారత దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో అమెరికా చాలా చురుకైన పాత్ర పోషించిందనీ, గట్టిగా జోక్యం చేసుకుందనీ అమెరికా రాయబారులు స్వయంగా ఒప్పుకున్న ఈ రెండు సందర్భాలు సుస్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూలదోసేందుకు ఆ విధంగా అమెరికా జోక్యం చేసుకుందని అర్థమవుతుంది.

రెండు పార్టీలకూ ఆమోదమే!

కనుక కాంగ్రెస్, బిజెపి (లేదా దాని పూర్వ రూపమైన జనసంఘ్)లకు విదేశీ జోక్యాన్ని ఆహ్వానించే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదనే వాస్తవాన్ని బట్టి చూస్తే దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల వారి నిబద్ధత ఏపాటిదో లేక నిబద్ధతా లేమి ఎంతటిదో కళ్లకు కడుతుంది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు భారత దేశంలో ఓటింగు శాతం పెంపు కోసం 2.1 కోట్ల డాలర్ల చెల్లింపులు చేసినట్టు అమెరికా అధ్యక్షుడు వెల్లడించిన అంశం చాలా తీవ్రంగా తీసుకోవలసి వుంటుంది. దీన్ని విస్మరించడం లేదా తోసిపారేయడం కుదిరేది కాదు. అసలు అది దేనిగురించోనన్నట్లు మాట్లాడుతూ బిజెపి లేదా కాంగ్రెస్‌లు దాన్ని కప్పిపుచ్చడం జరగనివ్వకూడదు.

ట్రంప్ ప్రభుత్వ వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయనీ ప్రభుత్వం దానిపై పరిశీలన జరుపుతున్నదనీ విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతకు మించి అసలు ఈ చెబుతున్న వాటిలో ఏమైనా నిజముందా లేదా అనేదానిపై మంత్రి పూర్తి మౌనమే వహించారు. కొన్ని మీడియా సంస్థలైతే ఈ నిధులు ఇండియా కోసం కాదనీ బంగ్లాదేశ్ కోసం ఉద్దేశించినవనీ వార్తలు ఇచ్చాయి. ట్రంప్ ఢాకాను ఢిల్లీ అని పొరబడి వుండొచ్చని చెప్పాయి. ఈ రకమైన వివరణ ఆశ్చర్యకరంగా వుండొచ్చు. ఏమైనా భారత దేశ వ్యవహారాల్లో యు.ఎస్.ఎయిడ్ జోక్యందారీ కార్యకలాపాలేమిటన్న దానిపై స్పష్టమైన పారదర్శకమైన వివరాలు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంటుంది.

ఆర్థికశాఖ మౌన ముద్ర

ట్రంప్ చెప్పిన విషయాలపై ఆర్థిఖ శాఖ కూడా మౌన ముద్ర దాల్చింది. 2023-24లో ఏడు ప్రాజెక్టులకు గాను యు.ఎస్.ఎయిడ్ ద్వారా 75 కోట్ల డాలర్లు (సుమారు 6,501 కోట్ల రూపాయలు) చేరినట్టు ఆ శాఖ వార్షిక నివేదిక పేర్కొంది. నీటి సరఫరా, పారిశుధ్యం వంటి పథకాలు వీటిలో వున్నాయి. అయితే ఈ 2.1 కోట్ల డాలర్ల గురించి మాత్రం ఆ నివేదిక ప్రస్తావించలేదు. ప్రభుత్వ నివేదికలు చెప్పే ప్రకారం యు.ఎస్.ఎయిడ్ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ భారత దేశంలోని వివిధ రంగాలలో 555 ప్రాజెక్టులకు లక్షన్నర కోట్ల రూపాయల నిధులు సమకూర్చింది. వరసుగా వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఏ పార్టీకి చెందినవనే దాంతో నిమిత్తం లేకుండా యు.ఎస్.ఎయిడ్ నిధులను ఉపయోగించుకున్నాయి.

అన్నీ తేల్చాల్సిందే

ఇదిలా వుంటే బిజెపి ప్రభుత్వం విదేశీ నిధుల (నియంత్రణ) చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని వివిధ పరిశోధనా సంస్థలకూ, స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జివో)లకూ నిధులు రాకుండా అడ్డుకున్నది. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ దాని భావజాలంతో ముడిపడిన ఇతర సంస్థలు మాత్రం నిరాటంకంగా నిధులు తెచ్చుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ పచ్చి ద్వంద్వ ప్రమాణాలు బిజెపి బూటకత్వాన్ని బట్టబయలు చేశాయి. మెజారిటీ మతతత్వ భావజాల ఎజెండాను ముందకు తీసుకుపోవడానికిగాను విదేశీ నిధులు వినియోగించే విషయంలో దానికి పెద్ద పట్టింపు లేదని కూడా తేటతెల్లం చేస్తున్నాయి.

యు.ఎస్.ఎయిడ్ నిధుల పూర్తి వివరాలు, ఆ ప్రాజెక్టుల స్వభావం, భారతదేశ అంతర్గత వ్యవహారాలలో దాని చొరబాటు తప్పక బయటికి తేవాలి. తన వ్యాపార ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ప్రభుత్వ విధానాలను అమెరికా ఏ విధంగా ప్రభావితం చేసిందో తెలుసుకోవలసిన హక్కు భారతీయులకు ఉంది. అంతకన్నా ముఖ్యంగా యు.ఎస్.ఎయిడ్ ద్వారా అమెరికా రాజకీయ ప్రభావం ఏ మేరకు నడించిందో తెలుసుకోవలసిన హక్కు మనకుంది. దేశ సమైక్యత, సార్వభౌమత్వాల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం తన స్వచ్ఛతను నిరూపించుకోవడం అవసరం.

('పీపుల్స్ డెమోక్రసీ' ఫిబ్రవరి 26 సంపాదకీయం)

సమస్య

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేర్లతో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన



> **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడంలో, వారి అప్పులు మాఫీ చేయడంలో ఆసక్తి చూపుతున్నాయి కానీ... పేద కుటుంబాల నుండి వచ్చిన ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం పైన దృష్టి పెట్టడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.2 చెప్తోంది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమైనది. కృత్రిమ నిబంధనలు సృష్టించి, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే దీని ఉద్దేశం. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం, సమానత్వం కోసం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి.**



బి. కాంతారావు

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్నా "సమాన పనికి సమాన వేతనం" అమలు కావడం లేదు. దీనివలన దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేర్లతో అనేక సౌకర్యాలను తగ్గించి, తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకొంటున్నాయి. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడంతో పాటుగా ఆర్థిక, సామాజిక భద్రత లేకుండా చేస్తూ బహిరంగంగా శ్రమ దోపిడికి దారితీసింది.

రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు సంబంధించిన అంశాలను పరిశీలిద్దాం. పౌరుడికి చట్టం ముందు సమాన హక్కును రాజ్యం నిరాకరించకూడదని, ప్రతి ఒక్కరికీ చట్టాల నుంచి సమానమైన రక్షణ కల్పించాలని ఆర్టికల్ 14(ఎ) హామీ ఇస్తున్నది. కానీ ఒకే పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు-రెగ్యులర్ ఉద్యోగులకు మధ్య వేతన వ్యత్యాసాలు ఈ హక్కును కాలరాస్తున్నాయి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన రక్షణను ప్రభుత్వాలు కల్పించటం లేదు. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను భక్షిస్తూ వారిని పేదరికంలోకి, నిరంతర అభద్రతలోకి నెడుతున్నాయి. ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగ నియామకాలలో ఎటువంటి వివక్ష ఉండకూడదు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల పేరుతో రిజర్వేషన్లను అమలు చేయకుండా రాజ్యాంగ విరుద్ధ నియామకాలు చేస్తూ సామాజిక న్యాయాన్ని గాలికి వదిలేశాయి. ఔట్ సోర్సింగ్ నియామకాల్లో రాజకీయ సిఫార్సులు, లంచాలు రాజ్యమేలుతూ నిరుపేద నిరుద్యోగులను నిస్సహాయ స్థితికి నెడుతున్నాయి. తెల్లవారి లేచింది మొదలు పేదరికం నిర్మూలన, సామాజిక న్యాయం గురించి మాట్లాడే పాలకులు అమానవీయమైన ఔట్ సోర్సింగ్ నియామకాలతో రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఆర్టికల్ 21 ప్రకారం జీవన హక్కు అంటే గౌరవప్రదమైన జీవితం. కాని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ హక్కుకు నిరాకరిస్తున్నారు. ఆర్టికల్ 39(డి) సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేస్తుంది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు రెగ్యులర్ ఉద్యోగులు వేతనాల కంటే తక్కువగా ఇవ్వడంతో రాజ్యాంగం నిర్దేశించిన సమాన పనికి సమాన వేతనం గాలి మాటగా మారిపోతుంది. నిరుద్యోగులకు పని అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆర్టికల్ 41 నిర్దేశిస్తుంది. ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాల తరబడి ఏర్పడిన ఖాళీలు నింపకుండా శాశ్వత స్వభావం కలిగిన ఉద్యోగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమైనది. భద్రత లేని ఉద్యోగాలు నింపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను అమలు చేయడంలేదు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. రెగ్యులర్ ఉద్యోగులతో పోల్చితే కాంట్రాక్ట్ ఉద్యోగులది తక్కువ వేతనం. సామాజిక భద్రత లేమి, పింఛన్, ఎస్.ఇ.సి, గ్రాట్యూటీ, వీడ్కోలు ప్యాకేజీ వంటి ప్రయోజనాలు లేకపోవడం వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారు. ఔట్ సోర్సింగ్ కంపెనీలు, మధ్యవర్తుల ద్వారా నియామకాలు జరగడం వల్ల మధ్యవర్తులకు లాభం, ఉద్యోగులకు నష్టం. కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రోత్సాహకాలు, ప్రమోషన్లకు దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి అవకాశాలు లేకుండా పోతున్నాయి. మన రాజ్యాంగం ప్రకారం ఆదర్శ యజమానిగా ఉండవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో అసమానతను ప్రోత్సహించే విధానం అవలంబిస్తున్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులు రిటైర్ అయినా, ఏ కారణం చేతనైనా ఉద్యోగాలు కోల్పోయినా ఆ తర్వాత పింఛన్, గ్రాట్యూటీ, ఆరోగ్య బీమా లేదా చికిత్స సదుపాయాలు అందడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం, భరోసా కూడా వుండడం లేదు.

"సమాన పనికి సమాన వేతనం" పౌరుల హక్కు మాత్రమే కాకుండా రాజ్యాంగంలో ప్రాథమిక విధానమని రంధిర్ సింగ్ కేసు (1978) తీర్పు పేర్కొంది. దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు విధానాలను రూపొందించాలని ఉమాదేవి కేసు (2006)లో సుప్రీంకోర్టు సూచించింది. సమాన పనికి సమాన వేతనం అనే హక్కును జగ్జీత్ సింగ్ కేసు (2016)లో సుప్రీంకోర్టు మరింత బలపరిచింది. తాత్కాలిక ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగులు వేతనాలు ఇవ్వాల్సి ఉందని తీర్పు ఇచ్చింది. కార్మికులకు వారి ప్రయోజనాలు అందకుండా చేసేందుకు కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించడం తప్పు. ఒకే విధమైన బాధ్యతలు నిర్వహిస్తూ, ఒకే రకమైన పనిచేస్తున్న వ్యక్తికి (కాంట్రాక్టు పేరిట)...మరొకరి (పర్మినెంట్ ఉద్యోగి) కంటే తక్కువ జీతం ఇవ్వడం కుదరదు. మరీ ముఖ్యంగా సంక్షేమ రాజ్యంలో అస్సలు కుదరదు" అని ధర్మాసనం పేర్కొంది. "తక్కువ వేతనం తీసుకుని పని చేయడానికి ఎవ్వరూ ఇష్టపడరు. తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో తన ఆత్మగౌరవాన్ని, హుందాతనాన్ని, స్వీయ విలువను తగ్గించుకుని మరీ తక్కువ జీతానికి పనిచేస్తారు. అలా చేయకపోతే తమపై ఆధారపడిన వారికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలుసు" అని తీర్పు రాసిన జస్టిస్ ఖేహర్ పేర్కొన్నారు. "ఒకే రకమైన పరిస్థితుల్లో, ఒకే రకమైన పని చేసే వారి మధ్య వేతనాల్లో తేడా ఉండటమంటే శ్రమను దోచుకోవడమే. ఇది కచ్చితంగా అణచివేత చర్యే" అని స్పష్టం చేశారు. తాత్కాలిక ఉద్యోగులను పునరుద్ధరించడంలో ప్రభుత్వాల నిబంధనలలో స్పష్టత అవసరమని మోహనలాల్ కేసు(2021)లో సుప్రీం కోర్టు చెప్పింది.

నిర్దిష్ట కాలం పనిచేసిన తర్వాత, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా విధానాలు రూపొందించాలి. సంస్థల పాత్రను పర్యవేక్షించడానికి ప్రత్యేక నియంత్రణా మండళ్లు ఏర్పాటు చేయాలి. కరువు భత్యం, ఇంటి అద్దె, పింఛన్, గ్రాట్యూటీ, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు అమలు చేయాలి. కనీస వేతనం, వర్క్ అవర్స్ నియంత్రణ పర్యవేక్షణలో కఠినమైన చర్యలు తీసుకోవాలి. కోర్టుల ద్వారా వచ్చిన తీర్పులు ముఖ్యంగా సమాన వేతనం తీర్పులు, త్వరగా అమలు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడంలో, వారి అప్పులు మాఫీ చేయడంలో ఆసక్తి చూపుతున్నాయి కానీ ...పేద కుటుంబాల నుండి వచ్చిన ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం పైన దృష్టి పెట్టడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.2 చెప్తోంది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమైనది. కృత్రిమ నిబంధనలు సృష్టించి, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే దీని ఉద్దేశం. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం, సమానత్వం కోసం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి.

(వ్యాసకర్త రాష్ట్ర కో-చైర్మన్, ఎ.పి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి. సెల్ : 9490623349)

జనవాక్యం

ఆందోళన అర్థవంతమే

దక్షిణాది రాష్ట్రాలు రానున్న నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియలో నష్టపోవచ్చుననే భయం అర్థరహితం కాదు. సహేతుకమే. అలా ఎవరూ భయపడనక్కర లేదంటూ, పార్లమెంటులో ఈ రాష్ట్రాలు ఏమాత్రం సీట్లు కోల్పోవడం జరగదంటూ నిన్న తమిళనాడులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆయన, ప్రభుత్వం ఈ పద్ధతిలో, ఇలా చేయొచ్చు అని చూచాయగానైనా చెప్తే తప్ప ఈ ఆందోళన సమసిపోదు. దానికి ముఖ్య కారణం ఇప్పుడు అమలులో ఉన్న ఏ విధానం తీసుకున్నా, ఫలితాలు వ్యతిరేకంగానే వస్తాయి. నూతనంగా, సృజనాత్మకంగా ఆలోచించాలి. వాస్తవానికి పదేళ్లకోసారి జరిగే ప్రతీ జనాభా లెక్కల తర్వాత పార్లమెంటు స్థానాల డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి. కానీ మూడుసార్లు మాత్రమే జరిగాయి. కారణం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచినప్పుడు, జనాభా నియంత్రణ చక్కగా అమలుపరిచిన రాష్ట్రాలు నష్టపోతున్నాయి. అలా జరగరాదని 1971 జనాభా లెక్కల ప్రకారమే సంఖ్య నిర్ధారించి, మరి 2026 వరకూ పెంచకుండా పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా ఫ్రీజ్ చెయ్యడం జరిగింది. 2026 తర్వాత వచ్చే జనాభా లెక్కల ప్రాతిపదికన కొత్తగా డీలిమిటేషన్ జరగాల్సి ఉంది. అది 2031 సెన్సెస్‌కి వర్తించాల్సింది. కానీ 2021లో కరోనా కారణంగా వాయిదా పడిన లెక్కలు 2026కి అందుబాటులోకి వస్తాయి కనుక అవే తాజా ప్రాతిపదిక అవుతాయి. పార్లమెంటు ద్వారా ఏర్పడబోయే డీలిమిటేషన్ కమిషన్ వాటినే గమనంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే జనాభా ట్రెండ్ పరికిస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా విపరీతంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ పెరిగింది. పార్లమెంటు సీట్లను అలాగే ఉంచి, 543 గానే ఉంచి, నియోజక వర్గాలను జనాభా నిష్పత్తి ప్రకారం మారిస్తే తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కేరళ చెరో ఎనిమిదేసి సీట్ల చొప్పున కోల్పోతాయి. అలా కాకుండా ఇంత జనాభా ఒక నియోజక వర్గం అంటూ మొత్తం సీట్లను 840కి పైగా పెంచాల్సి వస్తే, దక్షిణాది రాష్ట్రాలకు పది చొప్పున పెరిగితే, ఉత్తర ప్రదేశ్‌కు ఏకంగా 65 పెరుగుతాయి. ఏ రకంగా చూసినా నష్టమే కనబడుతుంది. కాబట్టి కేంద్రం, పార్లమెంటు ఈ అసమానతలు లేకుండా మార్గాంతరం చూడాలి. వీలైతే సీట్ల పెంపుదలపై ఫ్రీజింగ్ కొనసాగించి, రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచుకోవాలి. అప్పుడు కూడా రాజ్యసభకు రాష్ట్రాల ప్రాతినిధ్యంలో అసమానతలు ఏర్పడకుండా చూడాలి. సామాజిక న్యాయం, ప్రాంతాల ప్రాతినిధ్యం సరిగ్గా ఉన్నపుడే ప్రజాస్వామ్యానికి అందం. బలం.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

రాష్ట్ర బడ్జెట్‌పైనా విస్తృత చర్చ

- ఎమ్మెల్యేలు నోరు అదుపులో పెట్టుకోవాలి
- ఏప్రిల్‌లోపు 'నామినేటెడ్' భర్తీ
- టిడిపి శాసనసభపక్ష సమావేశంలో చంద్రబాబు


సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్, తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రబడ్జెట్ తరహాలో రాష్ట్ర బడ్జెట్‌పై కూడా విస్తృత చర్చ జరగాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు నిర్దేశించారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ రూపకల్పన చేశామని తెలిపారు. అసెంబ్లీలోని సమావేశ గదిలో టిడిపి శాసనసభ పక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలకు కొన్ని హెచ్చరికలు చేసినట్లు సమాచారం. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, అనవసరమైన విషయాలు మాట్లొడొద్దని హెచ్చరించినట్లు తెలిసింది. పొరపాటు మాట్లాడితే ప్రతిపక్షం అవకాశంగా తీసుకుంటుందని చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యేలకు, ప్రజలకు, కార్యకర్తలకు మధ్య సమన్వయం కొరవడిందని, దీనిపై సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిచి రావాలనే పట్టుదలతో ఈ రోజు నుంచే కష్టపడి పనిచేయాలని, అందరూ మళ్లీ గెలవాలని అన్నారు. నాయకుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పిస్తున్నానని చెప్పారు. త్వరలో నేతలు, కార్యకర్తలను పిలిపించి ప్రత్యేకంగా మాట్లడతానని తెలిపారు. పార్టీ నిర్మాణంపై దృష్టిపెట్టకపోతే అందరం మునుగుతామని, కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి పెట్టాలని అన్నారు. ఏప్రిల్‌లోపు నామినేటెడ్ పదవులన్నీ భర్తీ చేస్తామని, మార్కెట్ యార్డులు, దేవస్థానాలకు పేర్లు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. మహానాడులోపు పార్టీ పదవులు పూర్తిచేయాలని అన్నారు. వేసవిలో అతిసార కేసులపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని ఎంపి, ఎమ్మెల్యేలను కలుపుకొని ముందుకెళ్లాలని తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రుల ఆధ్వర్యంలో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై మంత్రులు, ఎంపిల మధ్య సమన్వయం అవసరమని అన్నట్లు తెలిసింది. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నట్లు తెలిసింది. ఇటీవల జగన్ ఇంటివద్ద అగ్నిప్రమాద ఘటనలో కుట్ర కోణం ఉందని వ్యాఖ్యానించినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని చీఫ్ విప్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరగా, ఆర్థిక పరిస్థితి ఆధారంగా నిర్ణయం తీసుకుంటానని అన్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి నారా లోకేష్, శాసనమండలి చీఫ్ విప్ పి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మలసాని మనోహర్, పొనకా జనార్ధన్‌కు హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన కేసుల్లో వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, లాయర్ పొనకా జనార్దన్‌రెడ్డిలకు హైకోర్టులో శుక్రవారం ఊరట లభించింది. వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మార్చి రెండో వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఆదేశాలను జారీ చేశారు. సిఎం చంద్రబాబుపై అనుచిత పోస్టులు పెట్టారంటూ శ్రీధర్‌రెడ్డి అనే సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను విజయవాడ, సూర్యారావు పేట పోలీసులు అరెస్టు చేశారు. అతని ఫోన్‌లో పై ఇరువురితో సంభాషణలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. సంభాషణలు హుందాగా లేవని, అవమానకరంగా ఉన్నాయంటూ పోలీసులు వారిద్దరిపై కూడా కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారిద్దరూ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ మార్చి రెండో వారానికి వాయిదా పడింది. దర్యాప్తునకు సహకరించాలని ఇరువురు పిటిషనర్లను ఆదేశించింది. పిటిషనర్లపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఆదేశించింది.

సిఆర్‌డిఎ కన్సల్టెంట్‌గా సుర్బానా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్ ఇండియా సంయుక్తంగా ఒప్పందం చేసుకున్నాయి. దీనికి సంబంధించిన ప్రక్రియ శుక్రవారం సిఆర్‌డిఎలో జరిగింది. సింగపూర్‌కు చెందిన సుర్బానా కంపెనీ జురాంగ్‌తో కలిసి సుర్బానా జురాంగ్‌గా అమరావతి నగరానికి మాస్టర్‌ప్లాను ఇచ్చింది. ప్రస్తుతం అదే కంపెనీ కన్సల్టెంట్‌గా ఒప్పందం చేసుకుంది. ప్రపంచబ్యాంకు, ఎడిబి రుణాలు ఇస్తున్న నేపథ్యంలో ఇక్కడ కాంట్రాక్టులు, పనుల నిర్వహణ తదితర అంశాలపై ఈ కన్సల్టెన్సీ ఎప్పటికప్పుడు నివేదిక తయారుచేసి ప్రపంచబ్యాంకుకు పంపుతుంది. ప్రపంచబ్యాంకు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా? లేదా? అనే అంశాలనూ నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఒప్పందం కార్యక్రమంలో సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, సుర్బాన్ జురాంగ్ ఇండియా చీఫ్ కన్సల్టెంట్ అవినాష్ మిశ్రా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌డిఎ స్ట్రాటజీ విభాగ డైరెక్టర్ సతీష్‌బాబు, సుర్బానా కంపెనీ ప్రతినిధి అభిషేక్ మల్హోత్రా, విశ్వబంధు మెహ్రా పాల్గొన్నారు.

నాక్ ముడుపుల కేసులో కెఎల్ కోనేరుకు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

కెఎల్ విశ్వవిద్యాలయానికి గుర్తింపు కోసం నేషనల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) టీమ్‌కు ముడుపులు ఇచ్చారనే అభియోగాలతో సిబిఐ నమోదు చేసిన కేసులో కెఎస్‌ఇఎఫ్ ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 'రూ.50 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. దర్యాప్తునకు సహకరించాలి. సాక్షులను బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ చేయకూడదు.' వంటి షరతులను విధిస్తూ జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాక్ బృందానికి లంచాలు ఇచ్చారన్న ఆరోపణలతో సిబిఐ ఇటీవల పలువురిపై కేసు నమోదు చేసిన పలువురిని అరెస్టు చేసింది.

కార్మికుల ఆనవాళ్లు!

- సహాయక చర్యలు ముమ్మరం
- మట్టిలో కూరుకుపోయినట్టు ప్రచారం?
- పుకార్లు నమ్మొద్దన్న కలెక్టర్


టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎల్ఎల్‌బిసి)లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. శుక్రవారం కొంత పురోగతి వచ్చినట్టు సమాచారం. ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద ఎనిమిది రోజుల కిందట జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన నాటి నుంచి వారిని రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అన్ని రకాల రక్షణ, సహాయక టీములను రప్పించింది. కేంద్ర బృందం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జిఆర్ఐ) రంగంలోకి దిగింది. కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునే ప్రయత్నంలో ప్రత్యేక బృందం జీరో గ్రావిటీ రాడార్ (జిపిఆర్) టెక్నాలజీని ఉపయోగించింది. మిషన్ ఆధారంగా బృందం సభ్యులు టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేశారు. మట్టిలో ఉన్న వారు మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్టు పరికరాలు గుర్తించినట్టు తెలుస్తోంది. ఐదు మృతదేహాలను గుర్తించినట్టు ప్రచారం జరిగింది. దీన్ని ఎవరూ అధికారికంగా ధ్రువీకరించడం లేదు. ఈ ప్రాంతంలో జలపాతాలు ఉన్నట్టు చెబుతున్నారు. కార్మికుల క్షేమంపై రోజురోజుకూ ఆందోళన పెరుగుతోంది. ప్రభుత్వం కూడా వారిని ఎలాగైనా రక్షించాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది. అధికారులు అక్కడే ఉంటున్నారు. శనివారం సాయంకాలం నాటికి కార్మికులను బయటకు తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, సజీవంగానా? మృతదేహాలనా? అనేదానిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

క్లిష్టంగా రెస్క్యూ ఆపరేషన్ : కలెక్టర్

మూడు మీటర్ల లోతులో కార్మికుల ఆనవాళ్లు గుర్తించామని జరుగుతున్న పుకార్లను నమ్మొద్దని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్లంతైన వారిని వెలికి తీయడానికి బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపారు. 11 రెస్క్యూ టీములు మూడు షిఫ్టుల్లో షిఫ్టుకు వంద మంది చొప్పున పని చేస్తున్నారని వివరించారు. అయినా, నిమిషానికి ఐదు వేల లీటర్ల నీరు వస్తుండడంతో పనులకు ఆటంకంగా మారిందని పేర్కొన్నారు. జెపి బేస్ క్యాంప్ కార్యాలయంలో సహాయక బృందాల అధికారులతో కలెక్టర్ సమీక్షించామని,. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నాలు తీవ్రంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వైద్య సిబ్బందిని, ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచామని, టన్నెల్‌లో 12 బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని వివరించారు. వాటిలో ఆర్మీ, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఫైర్ సర్వీసెస్, నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, హైడ్రా, సౌత్ సెంట్రల్ రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్ బృందాలు ఉన్నాయని తెలిపారు. బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు వేగవంతం చేసినట్టు పేర్కొన్నారు. పక్కా ప్రణాళికతో సహాయక చర్యలకు చేపడుతున్నామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నామని, ప్లాస్మా గ్యాస్ కట్టల ద్వారా శిథిలాలను తొలగిస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా కన్వేయర్ బెల్ట్‌ను ఉపయోగంలోకి తీసుకొస్తామని, బురదను తీసేందుకు ఎస్కావేటర్లను సిద్ధం చేస్తున్నామని వివరించారు. ప్రత్యేక కెమెరాలు, సెన్సార్ల ద్వారా లోపలి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

పంచాయతీరాజ్‌కు భారీగా కేటాయింపులు

- సవరించిన అంచనాల్లో తప్పని కోతలు
- 2024-25లో 1,237.30 కోట్లు కట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ శాఖకు 2025-26 ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు ప్రభుత్వం భారీగా రూ.14,573.20 చూపించింది. క్షేత్ర స్థాయిలో ఖర్చు విషయానికి వస్తే నిధుల కోతలతో వేల కోట్లు తగ్గించడం గమనార్హం. బడ్జెట్‌లో పేర్కొన్న లెక్కల ప్రకారం 2024-25 బడ్జెట్‌లో 11,876.32 కోట్లు కేటాయింపులు జరపగా, సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని 10,639.02 కోట్లకు తగ్గించారు. 2023-24లో వాస్తవ ఖర్చు రూ.12,678.25 కోట్లు ఉంది. కూటమి ప్రభుత్వంలో కేటాయింపుల కంటే వైసిపి ప్రభుత్వంలో చేసిన ఖర్చే అధికమని బడ్జెట్ లెక్కలు చెబుతున్నాయి. వాస్తవ ఖర్చు కంటే గత ఏడాది బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండగా దానిని సవరించి మరింత తగ్గించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు 2024-25లో రూ.2,413.90 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ.1,295.40కు తగ్గించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, కల్వర్టులు ఇతర అభివృద్ధి పనులకు నిధులు ఆశించినస్థాయిలో అందవు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు కేటాయించే నిధుల్లో గత ఏడాదితో పోలిస్తే పెంపు లేకుండా రూ.101.95 కోట్లు మాత్రమే ఉంది. పిఎంజిఎస్‌వైకి 2024-25 బడ్జెట్‌లో 600 కోట్లు కేటాయిస్తే సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని రూ.295 కోట్లకు తగ్గించారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో రోడ్ల నిర్మాణానికి రూ.800.26 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో ఈ నిధులను 185.44 కోట్లకే పరిమితం చేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులకు గత ఏడాది 11.59 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది కేటాయింపులు లేవు. పంచాయతీలకు ఇచ్చే సహాయం గత ఏడాది రూ.726.18 కోట్లు ఉండగా, ఈ ఏడాది 715.06 తగ్గించారు. మండల పరిషత్‌లకు ఇచ్చే నిధులు గత ఏడాది రూ.858.32 కోట్ల ఉండగా, ఈ ఏడాది రూ.852.20 కోట్లకు తగ్గాయి. జిల్లా పరిషత్‌లకు ఇచ్చే కేటాయింపు లు గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా రూ.5 కోట్లు మేర పెంచారు.

మార్కెట్లలో 'ఫ్రై'డే

- కొనసాగుతున్న ట్రంప్ సుంకాల మంట
- సెన్సెక్స్ 1400 పాయింట్ల పైగా పతనం
- రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబయి : దలాల్ స్ట్రీట్‌ను ట్రంప్ టారీఫ్‌ల దడ వీడటం లేదు. ఇప్పటికే చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా చేసిన ప్రకటన భారత మార్కెట్లను కుదేలు చేసింది. విదేశీ మదుపర్లు భారీగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం తదితర పరిణామాలతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు 2 శాతం మేర విలువ కోల్పోయాయి. అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు లేదా1.90 శాతం పతనమై 73,198కు పడిపోయింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 1,471 పాయింట్లు కోల్పోయింది.

మదుపర్ల సంపద దాదాపు రూ.9 లక్షల కోట్లు హరించుకుపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.384 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ బాటలోనే ఎన్ఎస్ఇ నిఫ్టీ 420.35 పాయింట్లు లేదా 1.86 శాతం క్షీణించి 22,125 వద్ద ముగిసింది. వరుసగా ఎనిమిదో సెషన్‌లోనూ నిఫ్టీ నష్టాలు చవి చూసింది. గతేడాది సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్ట స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బిఎస్ఇ సెన్సెక్స్.. నాటి నుంచి ఇప్పటి వరకూ 12,780.15 పాయింట్లు లేదా 14.86శాతం నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఇ సూచీ అప్పటి నుంచి ఇప్పటి వరకూ 4,153 పాయింట్లు లేదా 15.80 శాతం నష్టపోవడంతో ఇన్వెస్టర్లు బోరుమంటున్నారు. వారాంతం సెషన్‌లో సెన్సెక్స్-30లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మినహా అన్నీ నేల చూపులు చూశాయి. టెక్ మహీంద్రా 6 శాతానికి పైగా నష్టపోగా, ఇండస్‌ఇండ్ బ్యాంకు 5 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టైటాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, నెస్లే, మారుతి సుజుకి స్టాక్స్ అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ భారీ నష్టాలను చవి చూశాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్లు పూర్తిగా నష్టాలతో ముగిశాయి. గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.556.56 కోట్ల విలువైన వాటాలు ఉపసంహరించారు.

ప్రధాన కారణాలు..

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి పలు దేశాలపై విపరీతంగా టారీఫ్‌లను విధిస్తున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారి తీయొచ్చనే భయాలు మార్కెట్లను బెంబేలెత్తిస్తున్నాయి. మెక్సికో, కెనడాపై విధించిన సుంకాలు మార్చి 4 నుంచి అమల్లోకి వస్తాయని ఇటీవలే ప్రకటించారు. చైనాపై అదనంగా మరో 10 శాతం సుంకం విధిస్తానని.. తక్షణమే ఇది అమల్లోకి వస్తోందని తాజాగా ట్రంప్ ప్రకటించడం మార్కెట్లను భయాందోళనకు గురి చేశాయి. యూరోపియన్ యూనియన్‌పైనా 25 శాతం సుంకాలు వేస్తామని తెలిపారు. ఈ పరిణామాలు మదుపర్లను బెంబేలెత్తిస్తున్నాయి. భారత్ బ్యాంక్‌ల ఆదాయాలు బలహీనంగా ఉండొచ్చన్న అంచనాలు ఆందోళనకు గురి చేశాయి. అదే విధంగా చైనా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్న విశ్లేషణలకు తోడు ఆ దేశం ఈ మధ్య పెట్టుబడులకు వీలుగా కొత్త నిర్ణయాలు తీసుకోవడంతో ఎఫ్ఐఐలు ఆ దేశానికి తరలిపోతున్నాయి.

దళితులను మోసం చేసిన బడ్జెట్ : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన ఎస్సిలకు రూ.35 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.20 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది దళితులను మోసం చేయడమేనని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితులకు నామమాత్రంగానే కేటాయింపులు చెయ్యడమే కాకుండా గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాల పునరుద్ధరణ ఏదని ప్రశ్నించారు. వీటికి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. బడ్జెట్‌లో సబ్ ప్లాన్, బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, భూమి కొనుగోలు పథకం, కులాంతర వివాహ ప్రోత్సాహం, విదేశీ విద్య వంటి పథకాల ఊసే లేదన్నారు. దళితులకు ఎన్నికల హామీల్లో భాగంగా అన్ని రకాల వృత్తులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చారని, బడ్జెట్‌లో మాత్రం ఈ అంశం ప్రస్తావనే లేదన్నారు.

హామీలకు కేటాయింపుల్లేవు : బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్లో కేటాయింపులు లేవని రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి, వైసిపి నాయకులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ గత ప్రభుత్వం అప్పులు చేసిందని కూటమి నాయకులు చెప్పిందంతా అబద్ధమని బడ్జెట్ లెక్కల్లో తేలిపోయిందన్నారు. మొత్తం ప్రసంగంలో 25 సార్లు వైసిపి గురించి, 10 సార్లు విధ్వంసం గురించి ప్రస్తావించారని చెప్పారు. బడ్జెట్లో సూపర్‌సిక్స్‌కు మొండిచేయి చూపించారని, ఏడాదిలోపే రూ.1.19 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. 63 పేరాల్లో ఒక్కచోట మాత్రమే సూపర్‌సిక్స్ అని ప్రస్తావించారని అన్నారు. అలాగే స్థూల ఉత్పత్తి 12.9 శాతం పెరుగుతుందని చెబుతున్నారని, అటువంటి లెక్కవేయాలంటే కనీసం మూడేళ్ల పడుతుందని అన్నారు. అలాగే 2024 మార్చి 31కి రూ.3.75 లక్షల కోట్ల అప్పు ఉందని, ప్రస్తుత అప్పు రూ.4.38 కోట్లని తెలిపారు. లయబిలిటీస్‌లో రూ.80,194 కోట్లు, కార్పొరేషన్ అప్పులు రూ.2,48,677 కోట్లు, సివిల్ సప్లయి రూ.36 వేల కోట్లు, విద్యుత్ సంస్థలు రూ.34 వేల కోట్లు అన్నీ కలిపి రూ.9.74 లక్షల కోట్ల అప్పు ఉందని సిఎం తెలిపారని వివరించారు. అయితే రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశామని తమపై దుష్ప్రచారం చేశారన్నారు. వైసిపి హయాంలో రూ.3.33 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు వివరించారు.

బడ్జెట్ 2025- 26

'ఉపాధి' అనుసంధానం సరైంది కాదు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని చెప్పడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉద్దేశం వ్యవసాయ కార్మికులకు పని లేని సమయంలో 100 రోజులు పని కల్పించడం కోసం అని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు శుక్రవారం విడదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చట్టానికి కేటాయించిన నిధులు యంత్రాలు వినియోగానికి, సిమెంట్ రోడ్లకు, మెటీరియల్ కాంపొనెంట్‌కు ఉపయోగించడానికి అవకాశం లేదన్నారు. కేటాయించిన నిధుల్లో 40 శాతం మాత్రమే మెరీటిల్ కాంపొనెంట్‌కు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అటువంటి ఉపాధి పథకంలో రూ.6,026 కోట్లు కేటాయించి, వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని చెప్పడం చట్టానికి విరుద్ధమన్నారు.

పని దినాల పెంపు పట్టని ప్రభుత్వం

ఎన్నికల హామీల్లో చంద్రబాబు వ్యవసాయ కూలీలకు పెన్షన్ పథకాన్ని అమలులోకి తెస్తామని హామీ ఇచ్చాడని దాని ప్రస్తావనే లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు. వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధి పథకంలో పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కరువు ప్రాంతాల్లో అదనంగా ఉపాధి పనులు కల్పించడానికి సరైన కేటాయింపులు లేవని తెలిపారు. ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం కోసం అరకొరగా కేటాయింపులు చేశారని చెప్పారు. ఇది వాగ్దానాల ఆడంబర బడ్జెట్ తప్ప పేదలకు వనగూరే ప్రయోజనం లేదని తెలిపారు.

ఎఎన్ఆర్‌కు గుడివాడతో విడదీయలేని బంధం : హీరో సుమంత్

ప్రజాశక్తి-గుడివాడ

అక్కినేని నాగేశ్వరరావుకు కృష్ణాజిల్లా గుడివాడతో విడదీయరాని బంధం ఉందని సినీ హీరో, ఎఎన్ఆర్ మనవడు వై.సుమంత్ అన్నారు. శుక్రవారం గుడివాడలోని స్థానిక విశ్వభారతి పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఎన్ఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ, ఎఎన్ఆర్‌లు మంచి మిత్రులని తెలిపారు. ఎఎన్ఆర్ మరణించిన పదేళ్ల గడుస్తున్నా ఆయనను స్మరించుకుంటున్నామన్నారు. పాఠశాలలో ఎఎన్ఆర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులు ఎ.నాగసుశీల, నిర్మాత వై.సుప్రియ, ఎ.సంగీత, ఎ.సాహిత్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, విశ్వ భారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

‘ఆప్కాస్’ను కొనసాగించండి

పలు జిల్లాల్లో మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆప్కాస్‌ను రద్దు చేసే మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రాష్ట్రంలోని పలుచోట్ల శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని, దళారీ వ్యవస్థను తీసుకురావద్దని నినాదాలు చేశారు. ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే ఆప్కాస్ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామంటూ ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా హామీ ఊసే లేదన్నారు. పైగా మున్సిపల్ కార్మికులను కాంట్రాక్టు పరిధిలోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోందని తెలిపారు. మున్సిపల్ కార్మికులకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గూడూరులో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సూళ్లూరుపేటలో ఆర్‌డిఒ కార్యాలయంలో మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నెల్లూరులో కలెక్టరేట్ ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. ఈ తీర్మానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు ఎ.గణేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆర్‌డిఒ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికుల జీవితాలను నాశనం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, మరో నలుగురిపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు 351(2) ఆర్/డబ్ల్యు3, (5) బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హరీశ్‌రావు అనుచరులు తనను చంపుతామని, అంతు చూస్తామని బెదిరిస్తున్నట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి వంశీకృష్ణ, హరీశ్‌రావు, సంతోష్ కుమార్, పరశురాములు, వంశీ పేర్లను చేర్చారు. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చక్రధర్ గౌడ్ గతంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, నిందితుడు వంశీకృష్ణ బెయిల్‌పై విడుదలై తనను బెదిరిస్తున్నారని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు.

ఎసిబికి చిక్కిన పంచాయతీ ఇఒ

ప్రజాశక్తి – రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి గ్రామ పంచాయతీ పరిపాలనా అధికారి జి మహేశ్వర రయ్య అవినీతి నిరోధక శాఖకు శుక్రవారం పట్టుబడ్డారు. తిరుపతి అవినీతి నిరోధక శాఖ ఎఎస్‌పి విమల కుమారి, డిఎస్‌పి ప్రశాంతి తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి గ్రామ పంచాయతీ సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేశాను, ఇంజనీరింగ్ అధికారులు 'ఎంబుక్' చేశారని, ఆరు లక్షల బిల్లు పెండింగ్‌లో ఉందని, బిల్లులు మంజూరు చేయాలని పంచాయతీ ఇఒ జి మహేశ్వరయ్యను కాంట్రాక్టర్ దినేష్ కోరారు. ఇందుకు రూ.50 వేలు ఇవ్వాల్సిందేనని ఇఒ చెప్పడంతో కాంట్రాక్టర్ ఎసిబిని ఆశ్రయించారు. పంచాయతీ కార్యాలయం వద్దకు డబ్బులు తీసుకురావాలని పంచాయతీ ఇఒ చెప్పడంతో శుక్రవారం మధ్యాహ్నం 11 గంటలకు కాంట్రాక్టర్ లంచం అందజేశారు. కాపుగాసిన ఎసిబి అధికారులు లంచం తీసుకున్న స్థలం వద్దనే పట్టుబడి చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లారు. మహేశ్వరయ్యను విచారించి, సంబంధిత రికార్డులను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎసిబి ఎఎస్‌పి తెలిపారు. ఇఒ మహేశ్వరయ్యపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి నెల్లూరులోని ఎసిబి కోర్టుకు హాజరుపరిచారు. మహేశ్వరయ్యకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

రాజంపేట సబ్ జైలుకు పోసాని

14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/రాజంపేట అర్బన్

వైసిపి నేత, నటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల వాదనలు కొనసాగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి పిజె తేజసాయి మార్చి 12 వరకు రిమాండ్ విధించారు. దీంతో పోసానిని రైల్వేకోడూరు సిఐలు వెంకటేశ్వర్లు, హేమ సుందర్‌రావు రాజంపేట సబ్ జైలుకు తరలించారు. ఓబువారిపల్లె పోలీసుస్టేషన్‌లో సుదీర్ఘంగా 9 గంటలపాటు అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విచారణ చేశారు. కొద్దిసేపు విచారణకు సహకరించకుండా మొండి చేసిన పోసాని తాను అసభ్యకరంగా మాట్లాడిన వీడియోలను చూపిన అనంతరం చెప్పుడు మాటలు విని చాలా పెద్ద తప్పు చేశానని, అలా మాట్లాడి ఉండకూడదని, ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నానని, ఇంతకన్నా చెప్పేదేమీ లేదని పోసాని చెప్పారని పోలీసులు పేర్కొన్నారు. పోసాని తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపాటు మరో పది మందికిపైగా న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున ఎపిపి చిట్టిబాబు, ప్రభుత్వ ప్లీడర్ మోబినా, టిడిపి తరపున మరికొంత మంది న్యాయవాదులు వాదనలు వినిపించారు.


పోసానిని రాజంపేట సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్య సేవలు అందిస్తాం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి – మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డులను పరిశీలించి పేషెంట్లతో మాట్లాడారు. వైద్యాధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. ఎయిమ్స్‌కు విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరాను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, వీటిని పూర్తిస్థాయిలో సమకూరుస్తామని తెలిపారు. మొత్తం 960 పడకలు కావాల్సి ఉండగా 600 మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఐసియులో 96 పడకలు కావాల్సి ఉండగా 20 మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 23 ఆపరేషన్ థియేటర్లో ఉండాల్సి ఉండగా, 12 మాత్రం ఉన్నాయని, వీటి ఏర్పాటుకు కొద్దిగా ఆలస్యం అవుతుందన్నారు.



నత్తనడకన ఇ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు

- స్వచ్ఛందం కావడంతో ముందుకు రాని కార్మికులు
- నమోదులో వెనుకబడిపోతున్న రాష్ట్రాలు, యూటీలు
- తెలుగు రాష్ట్రాలదీ అదే దారి



న్యూఢిల్లీ : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులతో పాటు వలస కార్మికుల నమోదు కోసం కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో ప్రారంభించిన ఇ-శ్రమ్ పోర్టల్ పనితీరు ఆశాజనకంగా కన్పించడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసంఘటిత కార్మికుల సమాచారాన్ని నమోదుచేయడానికి కేంద్రం రూ.704 కోట్ల బడ్జెట్‌తో ఈ పోర్టల్‌ను ప్రారంభించింది. 2021 డిసెంబర్ 31 లోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. వలస కార్మికుల నమోదును చేపట్టి, ఆ సమాచారాన్ని కేంద్రానికి అందజేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు పొందాలంటే కార్మికులు విధిగా ఈ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కార్మికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడక నడుస్తోంది. నమోదులో పురోగతిని తెలియజేసే నివేదికను అందించడానికి మరింత సమయం ఇవ్వాలని 2022 మార్చి 18న సుప్రీంకోర్టును కేంద్రం అభ్యర్థించింది. ఆ సమయానికి 27.45 కోట్ల మంది అసంఘటిత కార్మికులు పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇక వలస కార్మికుల నమోదుకు సంబంధించి అనేక రాష్ట్రాలు వెనుక బడిపోయాయి. మహారాష్ట్ర 36.07 శాతం, తమిళనాడు 34.48 శాతం, తెలంగాణ 34.9 శాతం, గుజరాత్ 48.4 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకున్నాయి. దీంతో కోర్టు ఆయా రాష్ట్రాలకు మరో ఆరు వారాల గడువు ఇచ్చింది.

2021 ఆగస్టు 26న ప్రారంభమైన ఇ-శ్రమ్ పోర్టల్ నిర్వహణ కోసం 2019-20, 2024-25 మధ్యకాలానికి కేంద్ర ప్రభుత్వం రూ.704 కోట్లు కేటాయించింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమాచారాన్ని ఆధార్‌తో అనుసంధానిస్తారు. ఈ సమాచారంలో కార్మికుడి పేరు, వృత్తి, చిరునామా, వృత్తి ఏ తరహాకు సంబంధించింది, విద్యార్హతలు, నైపుణ్యం, కుటుంబ వివరాలు ఉంటాయి. 16-59 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండి, ఈఎస్ఐ, ఈపీఎఫ్ఓ, నేషనల్ పెన్షన్ సిస్టమ్ వంటి వ్యవస్థల్లో సభ్యులు కాని వారి వివరాలు మాత్రమే ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న ఎనిమిది కోట్ల మంది కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2023 ఏప్రిల్ 20న సుప్రీంకోర్టు ఆదేశించడంతో దానికి ప్రాధాన్యత ఏర్పడింది. అదే విధంగా మరో ఎనిమిది కోట్ల మందికి కూడా రేషన్ కార్డులు ఇవ్వాలని గత సంవత్సరం మార్చి 19న న్యాయస్థానం ఆదేశించింది.

వెనుకబడిపోయిన రాష్ట్రాలు

2020-21 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో కార్మికుల సంఖ్య 53.53 కోట్లు. వీరిలో 43.99 మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. 2024 మార్చి 31 నాటికి 29.51 కోట్ల మంది మాత్రమే ఇ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. అంటే దేశంలోని అసంఘటిత రంగ కార్మికుల్లో మూడింట రెండు వంతులకు పైగా (67.08 శాతం) పోర్టల్‌లో నమోదై ఉన్నారు. అయితే ఇది 2020-21లో కార్మికుల సంఖ్య ఆధారంగా వేసిన లెక్క. ఆ తర్వాత ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికుల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తోంది. 2024 మార్చి 31న 29.51 కోట్లుగా ఉన్న వీరి సంఖ్య ఈ సంవత్సరం ఫిబ్రవరి 19 నాటికి 30,65,04,015కి చేరింది. అయితే ఇక్కడ ఆందోళన కలిగించే విషయమేమంటే 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ రేటు జాతీయ సగటు రేటు (63.25 శాతం) కంటే తక్కువగా ఉంది. ఉత్తరాఖండ్ (95.05 శాతం), ఢిల్లీ (91.74 శాతం), బీహార్ (82.49 శాతం) రాష్ట్రాలు మాత్రమే మెరుగైన రిజిస్ట్రేషన్ రేటు సాధించాయి.

రాష్ట్రాల పనితీరు ఇలా...

వాస్తవానికి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది. కార్మికుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒడిషా (78.58 శాతం), జార్ఖండ్ (73.68 శాతం), పశ్చిమ బెంగాల్ (66.39 శాతం), హర్యానా (65.38 శాతం), ఛత్తీస్‌గఢ్ (63.68 శాతం) మంచి పనితీరు కనబరిచాయి. అదే సమయంలో బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన తెలంగాణ (30.91 శాతం), తమిళనాడు (34.63 శాతం), మహారాష్ట్ర (37.20 శాతం), ఆంధ్రప్రదేశ్ (40.04 శాతం), గుజరాత్ (42.20 శాతం), కర్నాటక (45.92 శాతం)లో రిజిస్ట్రేషన్ రేటు తక్కువగా ఉంది. కేరళ ఇటీవలే 50 శాతం రేటును దాటింది. అక్కడ 17.93 కోట్ల మంది అసంఘటిత కార్మికులు నేటికీ తమ వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో వంద శాతం రిజిస్ట్రేషన్లు జరగడానికి సంవత్సరాలే పట్టేలా ఉంది.

ఏం చేయాలంటే...

ఇ-శ్రమ్ అనేది స్వచ్ఛందంగా జరుగుతోంది. తప్పనిసరి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో కార్మికులు పెద్దగా ముందుకు రావడం లేదు. పైగా కార్మికులు తమంత తాముగా వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కంప్యూటర్‌లో వివరాల నమోదుకు కొంత ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నగదు బదిలీ వంటి చర్యల ద్వారా ఆర్థిక ప్రయోజనం కల్పిస్తే కార్మికులు మరింత ఉత్సాహంగా తమ వివరాలు నమోదు చేసుకుంటారు. ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. ఇ-శ్రమ్ పోర్టల్‌పై పెద్దగా ప్రచారం జరగడం లేదు. కొందరు ఇంటి పనివారు, వీధి వ్యాపారులకు దీని గురించే తెలియదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు యజమానులు, కాంట్రాక్టర్ల ద్వారా తమ వద్ద పనిచేస్తున్న కార్మికుల పేర్లు పోర్టల్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకునే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఉండకూడదు. సంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు, చిన్న, మధ్య తరహా సంస్థల్లో పనిచేస్తున్న వారు ఈ రెండు సౌకర్యాలనూ పొందుతూనే ఉన్నారు. దీంతో వారు ఇ-శ్రమ్ పోర్టల్‌లో చేరలేకపోతున్నారు. ఇ-శ్రమ్ పోర్టల్‌లో వలస కార్మికులు, గిగ్ వర్కర్ల సమాచారం లభించడం లేదు. పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్న వారిలో అత్యధికులు (52.13 శాతం) వ్యవసాయ కార్మికులే. అయితే వారి కోసం ఎలాంటి చట్టాలు అమలులో లేవు.

ఇపిఎఫ్ఓ వడ్డీ 8.25 శాతమే.

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్ఓ) ఖాతాల్లో నిల్వలపై వడ్డీరేటు ఖరారైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25 శాతం వడ్డీరేటునే కొనసాగించాలని ఇపిఎఫ్ఓ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు ఇడిఎల్ఐకి సంబంధించిన పలు సవరణలకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది.

కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీని చెల్లించిన సంగతి తెలిసిందే. సిబిటి నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తర్వాత వడ్డీ రేటును ఇపిఎఫ్ఓ అధికారికంగా నోటిఫై చేస్తుంది. ఆ తర్వాత వడ్డీ మొత్తాన్ని ఇపిఎఫ్ఒలో ఉన్న 7 కోట్ల చందాదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. సిబిటి ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థికశాఖ అతి త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది.

భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దెబ్బతీసేవారే జాతి వ్యతిరేకులు

- తమిళనాడు సిఎం స్టాలిన్



చెన్నై : భారతదేశ భాషాపరమైన, సాంస్కృతికపరమైన వైవిధ్యతను నాశనం చేసి, దేశ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్న వారే నిజమైన జాతి వ్యతిరేకులని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ శుక్రవారం విమర్శించారు. హిందీ భాషను బలవంతంగా ప్రజలపై రుద్దడంపై డిఎంకె కార్యకర్తలకు వరుసగా లేఖలు రాస్తూ వస్తున్న ఆయన తన నాల్గవ లేఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుండి పాలక పక్షంలో వున్నా, ప్రతిపక్షంలో కూర్చున్నా పార్టీ ఎప్పుడూ భాషను రక్షించుకునే పోరాటాల్లో అగ్ర భాగాన వుందని చెప్పారు. అందుకే డిఎంకె పోరాటం చేపట్టగానే కేంద్రంలోని పాలకులు భయపడుతున్నారని అన్నారు. 1930ల్లో, 1960ల్లో హిందీ వ్యతిరేక ఆందోళనల కాలం నుండి, హిందీని వ్యతిరేకిస్తూ డిఎంకె నేతలు పార్లమెంట్‌లో ఇచ్చే ప్రసంగాల వరకు వివిధ చారిత్రక సంఘటనలు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హిందీని రుద్దడమనేది సంస్కృతీకరణ, తమిళంపై సాంస్కృతికంగా దాడికి కుట్రఅని విమర్శించారు. ఇది గ్రహించే ద్రవిడ ఉద్యమనం దీనిపై పోరాడుతోందన్నారు. సంస్కృతం బదులుగా ఆలయాల్లో తమిళంలో పూజలు చేసుకోగలమా ? అని మేం ప్రశ్నించినట్టైతే 'తమిళం మాదిరిగా హిందీ కూడా మరో భాష అంతే' అని వాదించే వారి అస్సలు ఉద్దేశ్యం బయటపడుతుందని అన్నారు. అందుకే హిందీని రుద్దడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకించాలనుకుంటున్నామన్నారు.

రాష్ట్రానికి నిధులు విడుదల చేయకుండా, హిందీని రుద్దుతున్న కేంద్రాన్ని ప్రశ్నించడానికి బదులుగా తమిళనాడు బిజెపి నేతలు విచిత్రమైన కారణాలు చెప్పడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఉత్తర భారతీయుడు ఎవరైనా మనల్ని హిందీలో తిడితే తమిళులు అర్థం చేసుకోలేరంటూ వారు కారణాలు చెప్పడాన్ని విమర్శించారు. అటువంటి పరిస్థితుల్లో మనవారు తమిళంలో వారిని తిట్టలేరా? అని ప్రశ్నించారు. కానీ ఆత్మగౌరవమనే భావనతో తమిళులు అలా చేయబోరని అన్నారు. ఇక్కడి బిజెపి వారు అసలు ఎలాంటి వారని ఆయన ప్రశ్నించారు. ద్విభాషా సూత్రాన్నే తాము నమ్ముతామని, అదే పాటిస్తామని స్పష్టం చేశారు. కాలం మారుతోంది, హిందీ నేర్చుకోవాల్సిందే అంటే అనుమతించేది లేదు, తమిళం కన్నా హిందీ, సంస్కృతం ప్రాధాన్యంగా నిలిచేందుకు మేం అనుమతించబోమని చెప్పారు. తమ ప్రాణాలను ఒడ్డి అయినా తమిళ భాషను పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు. అదనపు భాషల భారాన్ని విద్యార్థులపై మోపరాదన్నారు. మాతృభాషలో, ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించుకుంటూ సైన్స్, టెక్నాలజీలో నైపుణ్యాల సాధించడంపై వారు దృష్టి పెట్టాలన్నారు.

ఇయు కమిషన్ చీఫ్‌తో మోడీ భేటీ

- ఎఫ్‌టిఎపై చర్చలు



న్యూఢిల్లీ : యూరోపియన్ యూనియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టిఎ)ను ఈ ఏడాది చివరి నాటికి ముగించే దిశగా చర్చలు జరిపామని మోడీ తెలిపారు. అలాగే నూతన వ్యూహాత్మక భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందంపై కూడా చర్చించినట్లు చెప్పారు. భారత్-ఇయుల మధ్య సంబంధం సహజమైనది, సేంద్రీయమైనదని మోడీ ఈ సందర్భంగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య విలువులు, ఉమ్మడి నమ్మకంపై ఈ బంధం ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఉర్సులా వాన్ డెర్ లేయన్ మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, సాంకేతిక సహకారం, భద్రత, రక్షణ వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకున్న భౌగోళిక, రాజకీయ సందర్భం నేపథ్యంలో భారత్‌తో నిర్ణయాత్మక చర్యను కోరుకుంటున్నట్లు చెప్పారు. 21 మంది కమిషనర్లతో కూడిన యూరోపియన్ యూనియన్ ప్రతినిధి బృందంతో కలిసి ఉర్సులా వాన్ డెర్ లేయన్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. ఒక దేశంలో ఇంత భారీ బృందంతో ఇయు కమిషన్ చీఫ్ పర్యటన జరపడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న ఇయు మధ్య సంబంధాలకు కొత్త ఊపును తీసుకొస్తుందని భావిస్తున్నారు. శుక్రవారం సమావేశంలో రష్యాపై ఆంక్షలపై ఎటువంటి చర్చలు జరగలేదని కేంద్ర విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈ భేటీ ఉక్రెయిన్ వివాదంపై విస్తృతమైన చర్చలు జరిగినట్లు ఇయు అధికారి ఒకరు చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై భారత్-ఇయు మధ్య 2007లో తొలిసారిగా చర్చలు జరిగాయి. 2022లో పున:ప్రారంభమయ్యాయి. అయినా ఇప్పటి వరకూ ఎలాంటి పురోగతి లేదు.

టారిఫ్ బెదిరింపులను ప్రతిఘటిస్తాం :చైనా

- అమెరికా తీరుపై ఆగ్రహం
- ఫెంటనిల్‌ను సాకుగా చూపడంపై ఆక్షేపణ

బీజింగ్ : అమెరికా టారిఫ్ బెదిరింపులను అంతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని చైనా స్పష్టీకరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. చైనా దిగుమతులపై అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. కెనడా, మెక్సికో దిగుమతులపై 25శాతం టారిఫ్‌లతో పాటు చైనా దిగుమతులపై అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ చెప్పారు. అమెరికా ఇలాంటి బెదిరింపులకు దిగడాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ శుక్రవారం చెప్పారు. ఫెంటనిల్ అంశాన్ని సాకుగా చూపిస్తూ అదనంగా పది శాతం సుంకాలకు దిగుతోందని ఆయన ఆక్షేపించారు. చైనాను బ్లాక్‌మెయిల్ చేయడానికి, ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ చైనా ఇదంతా చూస్తూ వూరుకోదని, చట్టబద్ధమైన తన ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అయితే ఇటువంటి వాణిజ్య టారిఫ్‌ల యుద్ధంలో విజేత అంటూ ఎవరూ వుండరని చైనా పదే పదే చెబుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికా ఏకపక్షంగా విధించే ఈ టారిఫ్‌లు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాలతో పాటూ మొత్తంగా ప్రపంచ ప్రయోజనాలను కూడా ఇవి దెబ్బతీస్తాయన్నారు. ఫెంటనిల్ అనేది అమెరికా సొంత సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. అయినా కూడా ఫెంటనిల్ సమస్యపై అమెరికా స్పందనకు మానవతా దృక్పథంతో చైనా మద్దతునిచ్చిందన్నారు. ఒత్తిడి తీసుకురావడం, బలవంతపెట్టడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలు చైనాతో వ్యవహారానికి సరైన మార్గం కాదని అన్నారు. పరస్పర గౌరవం అన్న మౌలికాంశాన్ని వదిలిపెట్టి ఇటువంటి చర్యలకు దిగడాన్ని ఆయన ఖండించారు.

తెలంగాణలో మరో ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం పచ్చజెండా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో మరో ఎయిర్‌పోర్టుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. వరంగల్‌లోని మామునూరులో విమానశ్రయానికి అనుమతించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు అనుమతినిస్తూ విమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన గత నెల 25న ఎయిర్ పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఇండియా (ఎఎఐ) చైర్మన్‌కు పౌర విమాన యాన శాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝా లేఖ రాశారు. మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం ఎయిర్ పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి అప్పగించేందుకు ఇంతకు ముందే రూ.205 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించింది. మామునూరులో విమానాశ్రయ పనులకు అవసరమైన అనుమతులు, అక్కడి నుంచి విమానాలు నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని రేవంత్ కోరారు. వీటితో పాటు భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలను మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు.

అమెరికాను కుదిపేస్తున్న సెక్స్ కుంభకోణం

- ఇంటెలిజెన్స్ సంస్థలో ప్రకంపనలు
- నిఘా సంస్థలోని మెసేజింగ్ యాప్‌లో అశ్లీల, అసభ్య మెసేజ్‌లు



వాషింగ్టన్ : అగ్ర రాజ్యాన్ని మరో సెక్స్ కుంభకోణం కుదిపేస్తోంది. దీంతో ట్రంప్ ప్రభుత్వంలో, పాలక పార్టీలో ప్రకంపనలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఎన్ఎస్ఎ (నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ)కి చెందిన ఇంటెలిజెన్స్ సిబ్బంది తమ సంస్థకు చెందిన ఇంటెలింకె అనే మెసేజింగ్ యాప్‌ను ఉపయోంచుకుని అందులో చాట్ రూమ్‌ను ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఆ చాట్‌రూమ్‌లో వారందరూ లింగ మార్పిడి విధానాలు, విచ్చలవిడి లైంగిక స ంబంధాల గురించి మాట్లాడుకున్నారని తెలుస్తోంది. దీనిపై అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ఒక ఉత్తర్వును జారీ చేశారు. ఈ చాట్ రూమ్‌లో పాల్గొని అసభ్యకరమైన, అభ్యంతరకరమైన, లైంగిక దోపిడీలకు సంబంధించి చర్చలు జరిపిన, సందేశాలు పంపిన వారిని నిఘా వర్గాలు గుర్తించాయని తెలిపారు. వారికి సంబంధించి ఒక మెమోను కూడా జారీ చేసినట్లు ఆమె ఎక్స్ పోస్టులో ధృవీకరించారు.

అసలేమిటి ఈ కుంభకోణం ?

ఎన్ఎస్ఎకి చెందిన ఇంటెలింక్ మెసేజింగ్ యాప్‌లోని చాట్ లాగ్‌లను మన్‌హటన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన పరిశోధకులు సంపాదించారు. ఈ రికార్డులను పరిశీలించినట్టైతే అనేక నిఘా సంస్థలకు చెందిన సిబ్బంది ఏదో ఒక రీతిలో అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారని తెలుస్తోందని ఎన్ఎస్ఎ వర్గాలు తెలిపాయి.

ఇటువంటి అనైతిక వ్యవహార శైలికి పాల్పడ్డారని అనుమానిస్తున్న ఉద్యోగులు లింగ మార్పిడి శస్త్రచికిత్స, వెంట్రుకల తొలగింపు, కృత్రిమ జననాంగాల ఏర్పాటు, హార్మోన్ చికిత్స, విచ్చలవిడి లైంగిక సంబంధాలు వంటి అంశాలకు సంబంధించి తో తమ అనుభవాలను పంచుకున్నారు. చర్చించుకున్నారని ఫాక్స్ వార్తా సంస్థ తన నివేదికలో పేర్కొంది. ఇందులో రక్షణ నిఘా సంస్థ, అమెరికా నావికా నిఘా సంస్థ, ఎన్ఎస్ఎలతో సహా పలు సంస్థలు వున్నాయి. ఎంప్లాయి రీసోర్స్ గ్రూపుల్లో ఈ సందేశాలు వెళ్ళాయి. ఈ గ్రూపులను కార్యకర్తలు హైజాక్ చేశారు. ప్రివిలేజ్, అలై అవేర్‌నెస్, ప్రైడ్, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ఇంక్లూజన్ వంటి శీర్షికలతో సమావేశాలు నిర్వహిస్తూ వీరు రోజంతా గడిపేసేవారు.

ఆ చర్చలకు సంబంధించిన రికార్డులను తాము సంపాదించామని మన్‌హటన్ పరిశోధకులు క్రిస్టోఫర్ రూఫో, హన్నా గాస్‌మన్‌లు తమ నివేదికలో వెల్లడించారు. ఈ చర్చలు, సందేశాలు ఇవన్నీ కూడా రెండేళ్ళనాటివి. సెక్స్, విచ్చలవిడి లైంగిక సంబంధాలు, కౌగిలింతలు వంటి వాటి గురించి వారు అందులో చర్చించారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎ నాయకత్వం వీరికి ఇలా చేయడంలో పూర్తిగా మద్దతిచ్చేదని ఆ నివేదిక పేర్కొంది.

చురుకుగా దర్యాప్తు చేస్తున్నాం

సంస్థ నిర్వహించే మెసేజింగ్ యాప్‌ను ఇలా దుర్వినియోగం చేయడంపై తాము చురుకుగా దర్యాప్తు జరుపుతున్నామని ఎన్ఎస్ఎ ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఈ ఆరోపణలను తాము తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. ఒకవేళ ఇవన్నీ నిజమని తేలినట్టైతే దీర్ఘకాలంగా వున్న ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ విధానాన్ని వారు తీవ్రంగా ఉల్లంఘించినట్లే అవుతుందని ఎన్ఎస్ఎ ప్రతినిధి వ్యాఖ్యానించారు. అమెరికా ప్రభుత్వ కంప్యూటర్లకు యాక్సెస్ వున్న వారిని వారిని ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ బాగా విశ్వసిస్తుంది. మా పనిని నియంత్రించే అన్ని చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలకు పూర్తిగా కట్టుబడి వుండాలని మేం కోరుకుంటున్నామని ఆయన వ్యాఖ్యానించారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రకాశ్ కరత్ తదితరులు

నియో ఫాసిస్టు బిజెపిని ఐక్యంగా ఎదుర్కోవాలి

- సిపిఎం మహారాష్ట్ర మహాసభలో ప్రకాశ్ కరత్ పిలుపు
- ఘనంగా 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వాన నియో ఫాసిస్టు, మతతత్వ, కులతత్వ, కార్పొరేట్ అనుకూల లక్షణాలున్న ఆర్ఎస్ఎస్ - బిజెపి పాలన నడుస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. దుర్మార్గమైన ఆర్ఎస్ఎస్ - బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా వామపక్షాలు, లౌకిక శక్తులు ఐక్యంగా విశాల పోరాటాలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం మహారాష్ట్ర 24వ రాష్ట్ర మహాసభ శుక్రవారం సెలూలో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధులు ప్రారంభోత్సవ సభలో కరత్ ప్రసంగించారు. దేశంలో నయా ఉదారవాద విధానాలతో పెట్టుబడిదారుల ప్రయోజనాలను మోడీ సర్కార్ కాపాడుతోందని విమర్శించారు. హిందూత్వ అజెండాను నియంతత్వ, బలవంతపు చర్యలతో అమల్జేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దిశగా రాజ్యాంగబద్ధమైన కేంద్ర సంస్థలను కూడా దుర్వినియోగం చేస్తున్నారని ఆక్షేపించారు. ప్రజా వ్యతిరేకమైన, దేశానికి హాని తలపెట్టే ఇలాంటి వినాశకర విధానాలను తిప్పికొట్టేందుకు సిపిఎం, వామపక్షాలు తమ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

సిపిఎం మహారాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉదయ్ నార్కర్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రతిపాదిస్తున్న స్వేచ్ఛ.. మానవ స్వేచ్ఛ అని అన్నారు. గాజా నుండి పర్భానీ వరకు మానవ హక్కుల కోసం స్వేచ్ఛ కోసం కమ్యూనిస్టులు పోరాటాలు సాగిస్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే హత్యాకాండలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్భానీలో పోలీసు కస్టడీలో సోమనాథ్ సూర్యవంశీ హత్య, బీడ్‌లోని మసాజోగ్ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య ఘటనలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా సిపిఎం సీనియర్ నాయకులు నరసయ్య ఆడమ్, ఉదయన్ శర్మ, దత్తా మానే, శివగొండ ఖోట్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి సిపిఎం సీనియర్ నేతలు నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి, సోలాపూర్ కళాకారుల బృందం ప్రదర్శనలు, గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ మహాసభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు మరియం దావలే, సిపిఎం పర్భాని జిల్లా కార్యదర్శి ఉద్ధవ్ పౌల్ సేలు, ప్రొఫెసర్ యు.ఆర్ థోంబల్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను నమ్మేదెవరు?

- పునర్విభజనపై విస్తృత చర్చలు అవశ్యం
- బృందాకరత్



న్యూఢిల్లీ : పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సంబంధిత భాగస్వామ్యపక్షాలందరితోనూ విస్తృత చర్చలు చేపట్టాల్సిందేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. ఈ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలు ఎనిమిది నియోజకవర్గాలను కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేయడం, దీనికి ప్రతిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ ఒక్క స్థానాన్ని కూడా కోల్పోయే అవకాశం లేదని, ఇంకా పెరిగే వీలుందని చెప్పడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై శుక్రవారం పిటిఐ వార్తా సంస్థ ప్రతినిధితో బృందాకరత్ మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం రాజ్యాంగబద్ధమైన అవసరమని, అయితే దీని చట్టబద్ధతపై దక్షిణాది ముఖ్యమంత్రులే కాకుండా దేశ ప్రజానీకం మొత్తంగా ఆందోళన వ్యక్తం చేస్తోందని బృందాకరత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వివక్షపూరిత వైఖరే ఇందుకు ప్రధానకారణమని ఆమె తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో విస్తృత సంప్రదింపులు, సమగ్ర చర్చలు ద్వారానే ఇలాంటి కీలకమైన అంశాలపై ఏకాభిప్రాయానికి రావాల్సివుంటుందని ఆమె ఉద్ఘాటించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదనే హామీలు ఇవ్వడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎవ్వరు? ఆయనను నమ్మేదెవరు? అందువల్ల ఇలాంటి అంశాలపై తగిన పద్ధతుల్లో చర్చలే ప్రధానమని ఆమె తెలిపారు.

ఉద్యోగుల తొలగింపులపై ట్రంప్ నిర్ణయానికి జడ్జి బ్రేక్

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ వ్యయాల తగ్గింపు ప్రణాళికల్లో భాగంగా పలు విభాగాల్లో పెద్ద ఎత్తున కోతలు విధిస్తున్న ట్రంప్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. భారీ సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి విలియం అల్సప్ అడ్డుకున్నారు. ట్రంప్ నిర్ణయాన్ని నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి అలాంటి అధికారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తొలగింపు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదేశించారు.

ఉద్యోగుల కోతలపై ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొన్ని కార్మిక యూనియన్లు కోర్టును ఆశ్రయించాయి. అనేక ఏజెన్సీల్లో దాదాపు ప్రొబేషనరీ సిబ్బంది అందర్నీ తొలగిస్తున్నారని, ఇది చట్ట వ్యతిరేకమని వారు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి అల్సప్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి తన సొంత సిబ్బందిని తొలగించే హక్కు ఉంది గానీ.. ఇతర విభాగాల్లో కోతలు విధించే అధికారం లేదు. ఫెడరల్ ఏజెన్సీలే తమ విభాగాల్లో సిబ్బంది నియామకాలు, తొలగింపులు నిర్వహించుకునేలా కాంగ్రెస్ వాటికి అధికారం కల్పించింది. కోతలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టవ్యతిరేకంగా కన్పిస్తోంది" అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

అమెరికాలో ప్రభుత్వానికి చెందిన పలు ఫెడరల్ ఏజెన్సీల్లో దాదాపు 2లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో చాలామందిని విధుల నుంచి తొలగించాలని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ నిర్ణయించింది. దీన్ని అధ్యక్షుడు ట్రంప్ కూడా సమర్థించారు. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. తాజాగా కోర్టు నిర్ణయంతో వారికి తాత్కాలిక ఊరట లభించినట్లయ్యింది.

రైతులపై ప్రతీకారేచ్ఛతో వ్యవహరిస్తున్న కేంద్రం

- ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి : కాంగ్రెస్

న్యూఢిల్లీ : కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. దేశంలోని రైతులపై ప్రతీకారం తీర్చుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధరను నిర్ధారించాలని కోరింది. మద్దతు ధరలు సమర్థవంతమైన రీతిలో పారదర్శకంగా వుండేలా చూసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ నెల 22 వరకు ఈ కమిటీ ఏడుసార్లు సమావేశమైందని, ఉప సంఘం 39 సార్లు సమావేశమైందని కాంగ్రెస్ నేత అభయ్ దూబే చెప్పారు. ఇదే సమయంలో 22న కేంద్ర వ్యవసాయ మంత్రికి విమానంలో విరిగిన కుర్చీ కేటాయించినందుకు, ఆయన ప్రయాణంలో ఇబ్బంది పడ్డానంటూ సోషల్ మీడియాలో రచ్చ చేశారు. కానీ అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న రైతాంగం సమస్యలు ఆయన దృష్టికి రావట్లేదు, వారి గురించి ఎవరూ మాట్లాడడం లేదని దూబే ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ప్రశ్నించారు. రైతు వ్యతిరేకిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చే బోనస్‌లు ఆపేసిందన్నారు.



మీ కోసం

గులాబీ మొక్కలు, మల్లెమొక్కలు ఎక్కువ పూలు పూయాలంటే.. ఒక చెంచా ఎక్స్పైరీ అయిన దగ్గు మందును ఒక లీటరు నీటిలో కలిపి రాత్రంతా ఆ నీటిని అలానే ఉంచి ఉదయం మొక్కల పాదుల్లో పోయాలి.

జీవన సౌరభం

అహంకారం సృష్టించే చీకటిని ఛేదించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

పోషకాల మణులు

ఆకు కూరలంటేనే
అందానికి మణులు
ఆరోగ్యాన్ని ఇచ్చేటి
ఖనిజాల గనులు

కాల్షియం పెరుగునులే
పొన్నగంటి కూరతింటే,
రక్త హీనత పోవును
తోటకూర చేర్చుకుంటే.

దంత వ్యాధులు తగ్గును
చుక్క బచ్చలి కూరుంటే,
మాంస కృతులు ఎక్కువ
పాలకూరతో పప్పుంటే.

ముఖ్యమైన అవయవాల
సమస్యలే తొలగించును
ఇంట పెరుగు మెంతి కూర
క్రమము తప్పక తింటే.


మధుమేహం నియంత్రించు
చక్కనైన చుక్కకూర,
మూత్రాశయంలో రాళ్ళు
కరగించును మునగాకు.

పుల్లనైన చింత చిగురు
శ్వాస బాగు పరచును
నోటిపూత తొలగించును
కరివేపాకు, కొత్తిమీర


ఏ ఆకు కూర అయిన
ఎన్నో పోషక విలువలు
పెరటిలో పెంచగలుగు
చిన్న చిన్న మొక్కలు.

తక్కువ ధరకే దొరకును
ఇంట చక్కగా ఎదుగును
కాలము ఏదైన గాని
కొద్ది వ్యవధిలో పెరుగును,

అందుకనే అందరము
ఆకు కూరలను తిందాం.
ఆరోగ్యంతో కూడిన
అలవాట్లు నేర్చుకుందాం!



- కూచిమంచి నాగేంద్ర,
చిన వాల్తేరు, విశాఖపట్నం,
91821 27880.



దారి చూపండి

పిల్లలూ, రఫీ, స్వీటీ స్కేటింగ్స్‌తో ఆడుకోవాలనుకుంటున్నారు. వాటి దగ్గరకు వెళ్లే దారి చూపరూ?

నేను గీసిన బొమ్మ





సయ్యద్ అర్షియా బేగం,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నందలూరు,
అన్నమయ్య జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చేనేత దుస్తులే మేలు

వేసవి ప్రభావం అప్పుడే మొదలైంది. ఎండల ప్రభావాన్ని తట్టుకోవాలంటే సరైన దుస్తులను ఎంచుకోవాలి. ఒంటికి సౌకర్యంగానూ, చూడటానికి చక్కగా అనిపించేలా ఉండేలా చేనేత కాటన్ దుస్తులను ఎంపిక చేసుకోవాలి.



వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే చాలామంది దుస్తుల ఎంపికపై శ్రద్ధ చూపుతున్నారు. వేసవి ఆరంభంలోనే దుస్తులు ఎంపిక చేసుకుంటే కొంత తక్కువ ధరల్లో కొనుగోలు చేయొచ్చుననే భావనను వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు ... ఇలా అన్ని వయస్సుల వారు ఉక్కపోత నుంచి తమను తాము రక్షించుకోవటానికి కాటన్ దుస్తులు ఉపయోగపడతాయి. ముదురు రంగు దుస్తులు అధిక వేడిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి తెలుపు, ఇతర లేత రంగుల్లోవి ఎంచుకుంటే హాయిగా ఉంటుంది.

రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లోని షాపుల్లో తాజాగా కాటన్ దుస్తుల లేబుళ్ల గుట్టలు గుట్టలుగా దిగుతున్నాయి. అన్ని వయస్సుల వారి అభిరుచులకు తగ్గట్టుగా మోడళ్లు, రంగులు అందుబాటులో కొచ్చేస్తున్నాయి. వ్యాపారులు కొనుగోలు దారులను ఆకట్టుకునేందుకు రకరకాల డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు.

రకరకాల దుస్తులు

బాతిక్, కాటన్, క్యాన్వాస్, క్రేప్, డెనిమ్, టెర్రీ, గాజీ, జిన్‌గమ్, జర్సీ, మద్రాస్, లెనిన్ కాటన్ తదితర రకాలకు చెందిన మెటీరియల్‌ను పురుషులు, చిన్నపిల్లల దుస్తులకు వాడుతుంటారు. బెంగాలీ, జామ్‌దాని, ఖాదీ, స్పన్, పోచంపల్లి, గద్వాల్, సింథటిక్, బెనారస్, బాతిక్, టెర్రీ, క్రేప్‌కాటన్ వంటివి స్త్రీలు డ్రస్సులు, చీరలకు ఉపయోగిస్తుంటారు. ఇవన్నీ ఇప్పుడు మార్కెట్లో అందుబాట్లో ఉన్నాయి.

ఇలా కూడా చేయొచ్చు!

- వేసవిలో దుస్తుల ఎంపికతో పాటు ఇంకొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండల్లో గొడుగుతో వెళ్లటం మంచిది
- కూలింగ్ గ్లాసెస్ (కళ్లజోడు) వాడాలి
- చేనేత వస్త్రాలు, వదులుగా ఉండే దుస్తుల ఎంపిక మంచిది
- జీన్స్, లెగ్గింగ్స్, టైట్ ప్యాంట్లను వాడొద్దు

చెమట సమస్యలకు చెక్

ఎండాకాలం వల్ల మన శరీరంలోంచి వెలువడే చెమటను కాటన్ క్లాత్ పీల్చుకుంటుంది. అప్పుడు అది గాలి తాకిడికి వెంటనే బయటకు వచ్చేస్తుంది. అన్ని వాతావరణాల్లోనూ మన శరీరాన్ని రక్షించే సత్తా కాటన్ వస్త్రాలకు ఉంది. వేసవిలో సింథటిక్, పాలిస్టర్ వంటి దుస్తులు మానేయటం మంచిది. ఈ కాలంలో అవి ధరిస్తే చర్మం దురదగా ఉంటుంది. కాటన్ చెమటను పీల్చి బయటకు పంపేయటం వల్ల చర్మ వ్యాధులు రావు.

నకిలీలతో జాగ్రత్త...

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నకిలీ దుస్తులు కూడా మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఏది అసలో, ఏది నకిలీయో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏదో ఒకటిలే.. కాటనే కదా అని కొనేస్తే తర్వాత వాటిని ధరించేటప్పుడు ఇబ్బందులు ఉంటాయి. కొన్న దుస్తులు ధరించటానికి వీల్లేకుండా వృథా అవుతాయి. అందువల్ల ప్రతిఒక్కరూ సమ్మర్ వేర్ ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి.

జీర్ణశక్తిని పెంచే 'బొప్పాయి'

బొప్పాయి పండులో చాలా రకాల విటమిన్లు ఉన్నాయి. ఈ పండును తరచూ తీసుకుంటే శరీరంలో ఉండే మలినాలను బయటకు పంపే గుణం ఉంటుంది. విటమిన్ ఎ, బి, సి, డి తగిన మోతాదులో ఉంటాయి. బొప్పాయి ఆకుల రసం తాగితే కూడా... ఎర్ర రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. భోజనం తర్వాత బొప్పాయి తింటే ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. పొట్ట, పేగుల్లో విష పదార్థాల్ని తొలగిస్తుంది. ఫ్లేవనాయిడ్స్, పొటాషియం, మినరల్స్, కాపర్, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి.

డెంగీ ఫీవర్‌తో బాధపడే వారికి ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. అలాంటి వారు తప్పనిసరిగా బొప్పాయి తినాలి. ఫలితంగా ప్లేట్ లెట్స్ మళ్లీ వేగంగా పెరుగుతాయి. ఇది చెడు కొవ్వును తగ్గిస్తుంది. గుండెకు రక్తం చక్కగా సరఫరా అయ్యేలా చేస్తుంది. తరచుగా దీనిని తింటే మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లను అరికట్టొచ్చు. అలసట, నీరసం వంటి అనారోగ్య సమస్యల్ని తొలగిస్తుంది. కాన్సర్‌పై పోరాడే గుణాలు కూడా ఉన్నాయి. ఇందులో బీటాకెరోటిన్, లూటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు కాన్సర్ వైరస్‌తో పోరాడతాయి. ఇది కొలన్, గర్భాశయ కాన్సర్లను తగ్గిస్తుంది. కళ్లు చల్లగా, ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు కూడా తింటే మంచిదే. స్కిన్ సున్నితంగా, మదువుగా, కోమలంగా మారడానికి ఉపయోగపడుతుంది.

విదర్భకు ఆధిక్యత

- సచిన్ సెంచరీ మిస్
- కేరళ తొలి ఇన్నింగ్స్ 342/10
- రికార్డు పుటల్లో హర్ష్ దూబే



సచిన్ బేబి (98 పరుగులు)

నాగ్‌పూర్: హర్ష్ దూబే రాణించడంతో సహా కేరళపై విదర్భ జట్టు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సంపాదించింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేయగా.. మూడోరోజు కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 37 పరుగుల ఆధిక్యతను సంపాదించింది. కేరళ ఇన్నింగ్స్‌కు ఆదిత్య సర్వటే(79), కెప్టెన్ సచిన్ బేబి(98) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా.. అహ్మద్ ఇమ్రాన్ (37), సల్మాన్ నిజర్ (21), మహ్మద్ అజారుద్దీన్ (34), జలజ్ సక్సేనాతో (28) కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. సచిన్ క్రీజ్‌లో ఉన్నంతసేపు కేరళ విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌ను దాటేసేలా కనిపించింది. అయితే సచిన్ సెంచరీ ముందు అనవసర షాట్ ఆడి జట్టును కూడా ఇరకాటంలో పడేశాడు. సచిన్ ఔటయ్యాక కేరళ ఇన్నింగ్స్ ఒక్కసారిగా గతి తప్పింది. 18 పరుగుల వ్యవధిలో చివరి 3 వికెట్లు కోల్పోయింది. పార్థ్ రేఖడే సచిన్ సహా జలజ్ సక్సేనా, ఏడెన్ యపిల్ టామ్ వికెట్లు తీశాడు. ఈ ఇన్నింగ్స్‌లో హర్ష్ మూడు వికెట్లు తీశాడు. కీలకమైన ఆదిత్య సర్వటే, సల్మాన్ నిజర్, ఎండీ నిధీశ్ వికెట్లు పడగొట్టాడు.

హర్ష్ దూబే రికార్డు...

విదర్భ ఎడమచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబే రంజీట్రోఫీలో ఒక రికార్డును తన పేర లిఖించుకున్నాడు. ఓ సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు(69 వికెట్లు) తీసిన బౌలర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఈ రికార్డు బీహార్ బౌలర్ అషుతోష్ అమన్ పేరిట ఉండింది. అమన్ 2018-19 ఎడిషన్‌లో 68 వికెట్లు తీశాడు. ప్రస్తుత రంజీ ఎడిషన్ (2024-25) ఫైనల్లో కేరళతో జరుగుతున్న మ్యాచ్‌లో హర్ష్, అమన్ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ ఎడిషన్‌లో హర్ష్ 19 ఇన్నింగ్స్‌ల్లో 16 సగటున 69 వికెట్లు తీశాడు.

స్కోర్‌బోర్డు...

విదర్భ తొలి ఇన్నింగ్స్: 379ఆలౌట్

కేరళ తొలి ఇన్నింగ్స్: చంద్రన్ (సి)దర్శన్ 14, రోహన్ (సి)దర్శన్ 0, ఆదిత్య (సి)మలేశ్వర్ (బి)హర్ష్ దూబే 79, అహ్మద్ ఇమ్రాన్ (సి అండ్ బి)యశ్ ఠాకూర్ 37, సచిన్ బేబి (సి)కరణ్ నాయర్ (బి)పార్థ్ రేఖడే 98, సాల్మన్ నజీర్ (ఎల్‌బి)హర్ష్ దూబే 21, అజారుద్దీన్ (ఎల్‌బి)దర్శన్ 34, జలజ్ సక్సేనా (బి)పార్థ్ రేఖడే 28, ఈడెన్ అప్లె (బి)పార్థ్ రేఖడే 10, ఎండి నిదీశ్ (ఎల్‌బి)హర్ష్ దూబే 1, బసిల్ (నాటౌట్) 0, అదనం 20. (125ఓవర్లలో ఆలౌట్) 342పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/14, 3/107, 4/170, 5/219, 6/278, 7/324, 8/337, 9/338, 10/342

బౌలింగ్: దర్శన్ 13-2-52-3, యశ్ ఠాకూర్ 17-1-83-1, భూటే 12-3-41-0, హర్ష్ దూబే 44-11-88-3, పార్థ్ రేఖడే 30-7-85-3, అక్షయ్ 9-5-11-0.

ఒక రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు..

హర్ష్ దూబే (విదర్భ)	: 10 మ్యాచ్‌ల్లో 69 వికెట్లు(2024-25)
ఆషుతోష్ అమన్ (బీహార్)	: 8 మ్యాచ్‌ల్లో 68 వికెట్లు(2018-19)
జయదేవ్ ఉనద్కత్ (సౌరాష్ట్ర)	: 10 మ్యాచ్‌ల్లో 67 వికెట్లు(2019-20)

సంక్షేమానికి అరకొరే !

బడ్జెట్ 2025- 26

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కేటాయిపులు ఘనంగా చూపించినా, సవరించిన అంచనాల్లో భారీ స్థాయిలో కోతలు వేస్తున్న విషయం బడ్జెట్‌ను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. సాంఘిక సంక్షేమానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,909.10 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.10,400.84 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని రూ.7,844.49 కోట్లకు తగ్గించింది. ఎస్‌సిలకు ఉచిత విద్యుత్ సరఫరాకు గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయిస్తే సవరించిన అంచనాల్లో పూర్తిగా కోత వేశారు. ప్రస్తుత బడ్జెట్‌లోను రూ.300 కోట్లు కేటాయించారు. ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌ల కోసం గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.42.95 కోట్ల మొత్తాన్ని సవరించిన అంచనాల్లో కోత పడింది. . పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు గత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని రూ.383.35 కోట్లకు పెంచారు. పిఎం అజయ్ పథకంలోను సవరించిన అంచనాల్లో రూ.400 కోట్ల మేర కోత విధించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు గత బడ్జెట్ రూ.4,406.74 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.4,973.99 కోట్లకు పెంచారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు కేటాయించిన రూ.633.61 కోట్లను సవరించి రూ.482.40 కోట్లకు కుదించారు. ప్రస్తుత బడ్జెట్‌లో గత ఏడాది కంటే తక్కువగా రూ.627.58 కోట్లే కేటాయించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఆర్థిక స్వావలంబన పథకాల కోసం కేటాయించిన రూ.341 కోట్లు సవరించిన అంచనాల్లో మొత్తం కోత వేశారు. ప్రస్తుత బడ్జెట్‌లోను రూ.341 కోట్లు కేటాయించారు.

గిరిజన సంక్షేమానికి అరకొర పెంపు

గిరిజన సంక్షేమానికి ప్రస్తుత బడ్జెట్‌లో 4,671.61 కోట్లు కేటాయించారు. గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పుకొచ్చే ప్రభుత్వం గత బడ్జెట్ కంటే కేవలం రూ.129.76 కోట్లను మాత్రమే పెంచింది. గత బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.4,561.85 కోట్లు కేటాయించిన ప్రభుత్వం సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ.4,228.05 కోట్లకు కుదించింది. గిరిజన సహకార ఆర్థిక సంస్థకు గత బడ్జెట్‌లో రూ.735.84 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో రూ.344.10 కోట్లకు కుదించారు. గిరిజన విద్యా సంస్థలకు గత బడ్జెట్‌లో రూ.948.10 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్ కేవలం రూ.945.02 కోట్లు ప్రతిపాదించారు.

బిసిలకు అంకెల ఎర

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.33,878.45 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌లో 29,879.94 కోట్లు కేటాయించగా ఆ మొత్తాన్ని సవరించిన అంచనాల్లో రూ.5,906 కోట్లకు తగ్గించి రూ. 23,973.26 కోట్లకు పరిమితం చేసింది. 2023-24లో వాస్తవ ఖర్చును పరిశీలిస్తే రూ.25,334.85 కోట్లుగా నమోదైంది. ఆదరణ పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. చేనేతలకు విద్యుత్ సబ్సిడీ కోసం రూ.200 కోట్లు కేటాయించారు. బిసి ఎ కేటగిరిలోని కార్పొరేషన్‌లకు గత బడ్జెట్‌లో రూ.1,658.35 కోట్లు కేటాయించగా సవరించి 549.96 కోట్లకే పరిమితం చేశారు. 2023-24లో వాస్తవ ఖర్చు రూ.2,847.58 కోట్లుగా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.2,379.38 కోట్లు ప్రతిపాదించారు. బిసి బి కేటగిరిలోని కార్పొరేషన్‌లకు గత బడ్జెట్‌లో రూ.1,237.31 కోట్లు కేటాయిస్తే, సవరించిన అంచనాల్లో... రూ.357.10 కోట్లకే పరిమితం చేశారు. 2023-24లో వాస్తవ ఖర్చు రూ.2,418.46 కోట్లుగా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు రూ.1,998.38 కోట్లకు మాత్రమే పరిమితం చేశారు.

బిసి డి కేటగిరిలో కార్పొరేషన్‌లకు గత బడ్జెట్‌లో రూ.1,858.93 కోట్లు కేటాయించారు. 2023-24లో వాస్తవ ఖర్చు రూ.2,737.36 కోట్లుగా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1,998.38 కోట్లు ప్రతిపాదించారు. బిసి ఇ కార్పొరేషన్‌లకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.574.42 కోట్లు ఉండగా సవరించిన అంచనాల్లో రూ.227.33 కోట్లకు కుదించారు. 2023-24లో వాస్తవ ఖర్చు రూ.689.26 కోట్లుగా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.887.14 కోట్లు కేటాయించారు. ఆర్యవైశ్య, బ్రాహ్మణ, ఇబిసి, కమ్మ, కాపు, క్షత్రియ కార్పొరేషన్‌లకు గత బడ్జెట్‌లో రూ.10,280.17 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో రూ.8,566.59 కోట్లకు కుదించారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,615.62 కోట్లు కేటాయించారు.

"పట్టణ" లెక్కల్లో గజిబిజి

- అమరావతికి బడ్జెట్ సాయం అవసరం లేదని ప్రకటన
- కేటాయింపుల్లో రూ.6000 కోట్లు
- పట్టణాభివృద్ధిశాఖకు రూ.13,862 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అత్యంత కీలకమైన పట్టణాభివృద్ధిశాఖ అందులోనూ అమరావతికి సంబంధించిన అంశంలో ప్రభుత్వం గజిబిజి గందరగోళానికి గురైంది. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ "రాష్ట్ర బడ్జెట్ సహాయం లేకుండానే స్వీయ పెట్టుబడి వనరులు కలిగిన రాజధాని నగరంగా అమరావతి మారింది' అని ప్రకటించారు. అదే సమయంలో బడ్జెట్ అంచనాల్లో మాత్రం రూ.6000 కోట్లు కేటాయించారు. పట్టణాభివృద్ధిశాఖకు రూ.13,862 కోట్లు కేటాయించారు. అమరావతికి ప్రపంచబ్యాంకు. హడ్కో, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ద్వారా నిధులు సమకూర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నట్లు మంత్రి ప్రసంగంలో చెప్పారు. ఈ మొత్తాన్ని నిర్ణీత కాలంలో చెల్లించాల్సిఉండటంతో ప్రజలపై వివిధ రూపాల్లో భారాలు పడటం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిధుల కేటాయింపు అంశాలను పరిశీలిస్తే విజయవాడ విశాఖ మెట్రో రైల్‌కు రూ.50 కోట్లు, అమృత్-2 కింద 123 మున్సిపాలిటీల్లో సదుపాయాల కల్పనకు రూ.751.72 కోట్లు, అలాగే ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు రూ.1020 కోట్లు వస్తాయని, అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు(యాన్యుటీకి) రూ.297.82 కోట్లు కేటాయించారు. క్యాపిటల్ రీజియన్ సోషల్ సెక్యూరిటీ ఫండ్‌కు రూ.115.11 కోట్లు ప్రకటించారు.

క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌కు రూ.836 కోట్లు ఖర్చు చేయనున్నట్లు లెక్కల్లో ప్రతిపాదించారు. గోదావరి కన్జర్వేషన్ ప్లానుకు రూ.23.26 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఐఐహెచ్‌టికి రూ.19 కోట్లు, కమ్యూనిటీ టాయిలెట్లకు రూ.6 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ కింద సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌కు రూ.125.94 కోట్లు కేటాయించారు. 91 మున్సిపాలిటీల్లో ఎస్‌టిపిల నిర్మాణానికి రూ.175 కోట్లు, ఎపి టిడ్కో కింద గృహ నిర్మాణానికి రూ.1109 కోట్లు మొత్తం రూ.10,869 కోట్లు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్లో ప్రతిపాదించారు. స్థానిక సంస్థల్లో వేర్వేరు సదుపాయాల కల్పనకు రూ.2844 కోట్లు కేటాయించారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.134.81 కోట్లు, డిటిసిపి విభాగానికి వేతనాల కింద రూ.13.94 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆఫ్ఘన్‌తో మ్యాచ్ వర్షార్పణం...

- సెమీస్‌కు ఆస్ట్రేలియా

లాహోర్ : కీలకమైన ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. సెదిఖుల్లా అటల్ (85), అజ్మతుల్లా ఒమర్జాయ్ (67) రాణించారు. 274 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 12.5 ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది. ఆ సమయానికి ట్రావిస్ హెడ్ 59, స్టీవ్ స్మిత్ 19 పరుగులతో నాటౌట్‌గా క్రీజులో నిలిచారు. వర్షం కారణంగా అంపైర్లు ఆటను నిలిపివేశారు. అనంతరం వాన ఆగిపోయినా అవుట్‌ఫీల్డ్‌లో భారీగా నీళ్ల నిలిచిపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేశారు. ఆసీస్, ఆఫ్ఘనిస్తాన్‌కు చెరో పాయింట్ కేటాయించారు. గ్రూప్-బి నుంచి 4 పాయింట్లతో ఆస్ట్రేలియా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. 3 పాయింట్లతో ఆఫ్ఘనిస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఆకాశంలో జిఎస్‌డిపి

- రెండేళ్ల 4 లక్షల కోట్ల పెరుగుదల
- జిఎస్‌డిపిలో రుణాలు 35 శాతం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి) ఆకాశమే హద్దుగా పెరిగిపోతోంది. కేవలం రెండేళ్లలోనే ఏకంగా నాలుగు లక్షల కోట్లకు పైగా పెరుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ అంచనాల్లో పొందుపరిచింది. ఆదాయం, వ్యయం మధ్య అంతరాలు ఉండడం, పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండడం కనిపిస్తున్నప్పటికీ జిఎస్‌డిపి మాత్రం భారీగా పెరగడం ఆశ్చర్యం కలిగించేదే. బడ్జెట్ ప్రతిపాదనల మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 14,22,094 కోట్ల రూపాయలను జిఎస్‌డిపిగా ప్రతిపాదించగా, వార్షికాంతానికి ఇది 16,06,109 కోట్లకు చేరుకుంది. ఇప్పుడు జిఎస్‌డిపి అంచనాలను 18,25,000 కోట్ల అంచనాగా ప్రతిపాదించారు. అంటే 2023-24 బడ్జెట్ ప్రతిపాదనకు, తాజా ప్రతిపాదనకు మధ్య ఏకంగా 4,02,906 కోట్ల రూపాయల పెరుగుదల కనిపించడం విశేషం. ఇక జిఎస్‌డిపిలో రాష్ట్ర రుణాలు ఏకంగా 35 శాతంగా ఉండడం గమనార్హం. 2020-21లో 36 శాతంగా ఉండగా, తరువాత ఇదే అత్యధిక శాతంగా ఉంటుందని ప్రతిపాదించారు.

ఇరిగేషన్‌కు ప్రాధాన్యత

- జలవనరులశాఖ మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బడ్జెట్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2027 డిసెంబర్‌నాటికి పోలవరం పూర్తి చేసి ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు గోదావరి జలాలు ప్రవహించేలా బడ్జెట్ కేటాయింపులున్నాయని చెప్పారు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు పెద్దపీట వేస్తూ నిధులు కేటాయించారని తెలిపారు. వెలిగొండ పూర్తి చేయడం ద్వారా ఫ్లోరైడ్ బాధితులున్న ప్రకాశం జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరుతుందని అన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్: వర్ల రామయ్య

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా రాష్ట్రబడ్జెట్ ఉందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి అగ్రతాంబూలం వేశారని తెలిపారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు నిధులు కేటాయించి మహిళలు, రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని ప్రజలకు తెలియజేశారని పేర్కొన్నారు.

మూలధనానికి పెద్దపీట: విజయ్‌కుమార్

బడ్జెట్‌లో మూలధన వ్యయానికి రూ.40వేల కోట్లు కేటాయించడం సంపద సృష్టికి పునాదులు వేయడం లాంటిదని జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యకు 10.8శాతమే కేటాయింపు

- తల్లికి వందనానికి సరిపోని నిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖకు బడ్జెట్‌లో 10.8 శాతం నిధులను మాత్రమే కేటాయించింది. పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2506 కోట్లు మొత్తంగా రూ.34,411 కోట్లు కేటాయింపులు చేసింది. సూపర్‌సిక్స్‌లో భాగంగా హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకానికి రూ.9,450 కోట్లు కేటాయించింది. అయితే దీనిని గత ప్రభుత్వం లానే ఈ ప్రభుత్వం కులాల కార్పొరేషన్ల నుంచి నిధులు సేకరించనుంది. రాష్ట్రంలో 1 నుంచి 12వ తరగతి వరకు సుమారు 81లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రూ.15వేల చొప్పున అందించాలంటే సుమారు రూ.12వేల కోట్లకు పైగా నిధులు అవసరం. ఇప్పుడు కేటాయించిన నిధులు 63 లక్షల మందికే సరిపోతాయి. అయితే లబ్ధిదారుల ఎంపికకు ప్రామాణికాలు ఏం తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. మనబడి మన భవిష్యత్(మన బడి నాడు-నేడు) కింద పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు. రెండో దశలో చేపట్టిన పాఠశాలల్లో పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. పెండింగ్ పనులు, కొత్త పనులు కలిపి ఇప్పుడు కేటాయించిన రూ.500 కోట్ల నిధులు చాలని పరిస్థితి. ప్రత్యేకంగా ఈ సారి పాఠశాల భవనాల విద్యుత్ బిల్లుల కోసం రూ.175 కోట్లు కేటాయించింది. అయితే ఇది పాఠశాలలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారా? లేదా బిల్లులు చెల్లిస్తారా? అనే అంశం చూడాల్సి ఉంది. ఉన్నత విద్యకు రూ.2506.01 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, బిఇడి, ఎంఇడి శిక్షణ కళాశాలలకు కూడా బడ్జెట్ తగ్గింది. డిగ్రీ కళాశాలలకు గతేడాది రూ.775.83 కోట్లు ఖర్చు చేయగా ప్రస్తుతం రూ.742.04 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆదికవి నన్నయ్య, కర్నూల్‌లోని క్లస్టర్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ, యోగి వేమన విశ్వవిద్యాలయాలకు బడ్జెట్ కేటాయింపులు చేయలేదు.

వ్యవసాయ రంగం నిర్వీర్యం

- మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్ ఉందని వ్యవసాయశాఖ మాజీ మంత్రి, వైసిపి నాయకులు కాకాని గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులను నయవంచన చేసిందని, అన్నదాత సుఖీభవ పేరుతో మరోసారి దగా చేసిందని అన్నారు. కేంద్రం ఇచ్చేది కాకుండా రూ.20 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడు దాంతో కలిపి అంటూ రైతులను మోసం చేసిందని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఆర్‌బికె వ్యవస్థ నిర్వీర్యం అయిందని విమర్శించారు. ప్రజల ఆశలు నెరవేరుతాయనే నమ్మకం కనిపించడం లేదని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవకు రూ.10,700 కోట్లు అవసరం ఉండగా రూ.6300 కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ఉచిత బోర్ల పథకాన్ని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68